నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
1
నిజామాబాద్-కామారెడ్డి
శుక్రవారం | మార్చి 07, 2025 | www.navatelangana.com

రెండు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

నవతెలంగాణ-దోమకొండ

అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్‌లు పట్టుకుని సీజ్ చేసినట్లు ఎస్సై అనిల్ గురువారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఆరేపల్లి వాగు వద్ద ఎలాంటి అనుమతి లేకుండా రెండు ఇసుక ట్రాక్టర్‌లు సీజ్ చేసి పోలీసు స్టేషన్‌కు తరలించినట్లు, ట్రాక్టర్ యజమానులు, డ్రైవర్లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై అనిల్ తెలిపారు. ఎవరైనా ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే, చట్ట ప్రకారం కేసులు నమోదు చేస్తామని తెలిపారు.


పోలీసులు పట్టుకున్న ఇసుక ట్రాక్టర్లు

ఎన్‌సిడి స్క్రీనింగ్ పరీక్షలు

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని ఆయా గ్రామాలలో ఉన్న ఆరోగ్య ఉప కేంద్రాల ఆధ్వర్యంలో నాన్ కమ్యూనికేబుల్ డిసీసెస్ (ఎన్‌సిడి) వైద్య పరీక్షలను మెడికల్ అధికారి దివ్య ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది నిర్వహించారు. 30 సంవత్సరాలు పైబడిన వారందరికి బిపి, షుగర్, రక్తపోటు, మధుమేహం, క్యాన్సర్ వ్యాధులను గుర్తించడానికి 40 రోజుల్లో 100శాతం వైద్య పరీక్షలు నిర్వహించాలని వైద్య సిబ్బందికి సూచించారు. 30 సంవత్సరాలు పైబడిన వారు తప్పకుండా వైద్య పరీక్షలు నిర్వహించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఈఓ వెంకటరమణ, స్టాఫ్‌నర్స్, ఏఎన్ఎం, ఆశావర్కర్లు, వైద్య సిబ్బంది, తదితరులున్నారు.



మూతపడిన ఆయుర్వేద కేంద్రం

- అందని ద్రాక్షగా వైద్యం
- రెండేండ్ల క్రితం సంబంధిత అధికారి బదిలీ
- ఇప్పటికీ నియమించని వైనం
- ఇబ్బందులు పడుతున్న రోగులు
- పట్టించుకోని అధికారులు

ఇంగ్లీష్ మందులకు డిమాండ్ పెరగడంతో ఇందుకు తోడుగా ఆయుష్ కేంద్రాల్లో వైద్య సిబ్బంది కొరతతో రానురానూ ఆయుర్వేద వైద్యం అందని ద్రాక్షలా మారింది. ప్రభుత్వం లక్షలు ఖర్చుచేసి ఏర్పాటు చేసిన ఆయుష్ కేంద్రాలు కనుమరుగవుతున్నాయి. ఇందుకు నిదర్శనం పెద్దకొడప్‌గల్‌లోని మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉన్న ఆయుష్ వైద్యశాల గది మూతబడటమే. అందులో ఉన్న మందులు చీమలు, పురుగుల పాలవుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఫలితంగా మండల ప్రజలకు యునాని, హెూమియో, ఆయుర్వేద చికిత్స అందని ద్రాక్షలా మారింది.



నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

ప్రభుత్వం ఆయుష్ కేంద్రాల పేరుతో అందించే సేవలు క్షేత్రస్థాయిలో అందడం లేదు. ఆరోగ్య కేంద్రంలో ఉన్న ఆయుష్ కేంద్రానికి ఒక కంపౌడర్ మాత్రమే దిక్కవడం గమనార్హం. ఆరోగ్య కేంద్రంలో ఓ గదిలో ఆయుర్వేద ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న వైద్యాధికారి రెండు సంవత్సరాల క్రితం బదిలీపై వెళ్లారు. అప్పటి నుంచి వైద్యాశాలకు వైద్యాధికారి, సిబ్బంది ఎవరు రాలేదు. ప్రస్తుతం ఆసుపత్రిలో ఎవరూ లేరు. కాంపౌండర్ ఉన్నట్లుగా రికార్డుల్లో ఉన్నా ఏనాడు ఆసుపత్రిలో కనిపించిన దాఖలాలు లేవు. ప్రజలకు సేవలందించిన ఆనవాళ్లు అసలే లేవు. వైద్యశాలపై సంబంధిత జిల్లా ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఆసుపత్రిని పట్టించుకునేవారే కరువయ్యారు. ప్రభుత్వం లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన వైద్యశాల, మందులు ఎందుకు పనికి రాకుండా పోవాల్సిన దుస్థితి నెలకొంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు ఆయుర్వేద వైద్యశాలపై పర్యవేక్షణ చేసి, మండల ప్రజలకు ఆయుర్వేద వైద్యం అందేలా చూడాలని పలువురు కోరుతున్నారు.

మున్సిపల్ కార్మికుల రెండు నెలల వేతనాలు
వెంటనే ఇవ్వాలి చెల్లించాలి


సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు

- సీఐటీయూ డిమాండ్
- మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా

నవతెలంగాణ-కామారెడ్డి

మున్సిపల్ కార్మికుల రెండు నెలల వేతనాలు వెంటనే ఇవ్వాలి చెల్లించాలని మున్సిపల్ కార్మిక సంఘం (సిఐటియు) జిల్లా అధ్యక్షుడు రాజనర్సు డిమాండ్ చేశారు. ఉదయం ఐదు గంటల నుంచి సిఐటియు ఆధ్వర్యంలో విధులు బంద్ చేసి మున్సిపల్ ఆఫీస్ ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజనర్సు మాట్లాడుతూ.. గత ఐదు నెలల నుంచి అనేకమార్లు మున్సిపల్ కార్మికులు మున్సిపల్ కమిషనర్లకు వినతిపత్రం ఇచ్చినా.. పట్టించుకోలేదన్నారు. గత ఆరు నెలల్లో ఆరుగురు కమిషనర్లు మారడం ఇక్కడి రాజకీయాలకు నిదర్శనమన్నారు. ఇప్పటికైనా రాజకీయ నాయకుల జోక్యం లేకుండా మున్సిపల్ అధికారులు కానీ జిల్లా స్పెషల్ ఆఫీసర్‌గా ఉన్న జిల్లా కలెక్టర్ గాని స్పందించి మున్సిపల్ కార్మికుల రెండు నెలల వేతనాలు ఇవ్వాలని అన్నారు. అలాగే మున్సిపల్‌కు సంబంధించిన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు కార్మికులపై వేధింపులు మానుకోవాలని, ఇప్పటికీ స్పెషల్ ఆఫీసర్ పాలన కూడా రాజకీయ ఒత్తిళ్లకు లోబడి పనిచేస్తున్న మున్సిపల్ అధికారులు రాజ్యాంగ బద్ధకంగా పనిచేయవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కొంతమంది అధికారులకు రాజకీయ నాయకుల తొత్తులుగా మారి ఆ అధికారులు మున్సిపల్ కార్మికులైన అట్టడుగు వర్గాలకు చెందిన దళితులు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ చెందిన కార్మికులను ఇబ్బంది పెట్టడం సరైన పద్ధతి కాదన్నారు. ఇప్పటికైనా అధికారుల తీరు మార్చుకోవాలని తెలిపారు. అనేకసార్లు కమిషనర్‌లకు వినతి పత్రాలు ఇచ్చినా స్పందించకపోవడంతో కార్మికులను అధికారులు వేధింపులతో మానసికంగా ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. ఈ ధర్నా వద్దకు మున్సిపల్ కమిషనర్ రాజేందర్ రెడ్డి వచ్చి సమస్యలను పరిష్కరిస్తామని హామీనిచ్చారు. ఇప్పటికైనా మా సమస్యలు పరిష్కరించకుంటే మెరుపు సమ్మెకైనా సిద్ధమవుతారని కమిషనర్‌కు సీఐటీయూ నాయకులు తెలియజేశారు. సోమవారం లేదా మంగళవారం తమ జీతాలు రాకుంటే అప్పటికైనా మెరుపు సమ్మెకు వెళ్తామని కమిషనర్ కు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మహబూబ్, జిల్లా ఉపాధ్యక్షులు ప్రభాకర్, కాత్రియాల ప్రభు, నాయకులు ఎర్రోలు నరసవ్వ, ఎల్లవ్వ, బుధవా, ఎర్రోళ్ల నర్సవ్వ, నడిపి నరసవ్వ, భూదేవి, సావిత్రి, విజయ్ సుమారు 400 మంది కార్మికులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలందించాలి

- బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి

నవతెలంగాణ-నసురుల్లాబాద్

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వచ్చే ప్రజలకు మెరుగైన సేవలందించాలని బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి ఆరోగ్య సిబ్బందికి ఆదేశించారు. గురువారం బాన్సువాడ మండలంలోని తాడ్కోల్ గ్రామ ప్రాథమిక ఉప ఆరోగ్య కేంద్రాన్ని గురువారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు రిజిష్టర్లు, ఆసుపత్రి పరిసరాలు, మందుల నిల్వలు పరిశీలించారు. అంతకుముందు గ్రామంలో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనాన్ని, ప్రాథమిక పాఠశాలను, అంగన్వాడీ కేంద్రాన్ని ఆకస్మికంగా వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ కిరణ్మయి ప్రభుత్వ ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులకు ఆరోగ్య సూచనలతో పాటు ప్రాథమిక చికిత్స అందించాలని వారు ఆదేశించారు. వైద్య ఆరోగ్య సిబ్బంది సమయపాలన పాటించాలని విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదన్నారు. పల్లె ప్రకృతి వనంలో మొక్కలను రక్షించాలన్నారు. అంగన్వాడీ సెంటర్లో పిల్లలకు పోషకాహారం అందించాలని ఆటపాటలతో విద్యాబోధన అందించాలన్నారు. వీరి వెంట ఎంపీడీవో, ఎంపీఓ, వైద్య ఆరోగ్య సిబ్బంది, అంగన్వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


మందులను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

అద్దె గదిలో పోస్టాఫీస్

- పెన్షనర్స్‌కు అవస్థలు


పింఛన్ కోసం క్యూ కట్టిన పలువురు

నవతెలంగాణ-పోతంగల్

మండల కేంద్రంలో ఉండే ముఖ్యమైన ఆఫీసులలో పోస్టాఫీస్ ఒకటి. ప్రస్తుతం పోతంగల్ మండల కేంద్రంలోని పోస్టాఫీసు కార్యాలయం అద్దె గదిలో కొనసాగుతోంది. పోస్టాఫీసులో ప్రధానంగా వృద్ధులకు నెలానెలా పెన్షన్లను అందజేస్తారు. అయితే పోస్టాఫీసు కార్యాలయం ఆవరణలో స్థలంలేకపోవడంతో వృద్ధులు, ఇతరులు ఎండలోనే పింఛన్ కోసం క్యూ కడుతున్నారు. దీంతో వారు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. పింఛన్ పంపిణీ కేంద్రంలో సౌకర్యాలు కలిపించాలని లేదా కార్యాలయాన్ని ఇతర ప్రాంతానికి మార్చాలని వృద్ధులు కోరుతున్నారు.

పాఠశాల ప్రాంగణం.. అపరిశుభ్రం

నవతెలంగాణ-నిజాంసాగర్

మండలంలోని అచ్చంపేట్ గ్రామంలోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ ప్రాంగణం అపరిశుభ్రంగా మారింది. మురికి నీరు పాఠశాల పక్కనే నిలవడంతో దోమల బెడద పెరిగిపోతుందని పందులు స్వైర విహారం చేస్తున్నాయని విద్యార్థులు వాపోతున్నారు. పాఠశాల భవనం పైప్ నుంచి నీరు లీకవుతూ పాఠశాల గోడ మొత్తం పాడవుతోందని విద్యార్థులు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పాఠశాల ప్రాంగణం పరిశుభ్రంగా ఉంచాలని వారు కోరుతున్నారు. పైప్‌లైన్ మరమ్మతులు చేయించాలని వారు తెలిపారు.



స్థానిక సంస్థల్లో వికలాంగులకు ప్రాతినిధ్యం కోసం
అసెంబ్లీలో చట్టం చేయాలి

- ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర కార్యదర్శి ఆడివయ్య

నవతెలంగాణ-బోధన్

స్థానిక సంస్థల ఎన్నికలలో వికలాంగులకు ప్రాతినిధ్యం కోసం అసెంబ్లీలో చట్టం తేవాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక రాష్ట్ర కార్యదర్శి ఆడివయ్య అన్నారు. గురువారం బోధన్ పట్టణంలో జరిగిన నిజామాబాద్ కార్యవర్గ విస్తృతస్థాయి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 2012 నుంచి పెన్షన్లలో కేంద్ర ప్రభుత్వం వాటా కేవలం 300 రూపాయలు మాత్రమే చెల్లిస్తుందని, దీంతో వికలాంగులు ఎట్లా బతుకుతారని ప్రశ్నించారు. నిత్యావసర సరుకుల ధరలు 300 రేట్లు పెంచిన మోడీకి వికలాంగుల పెన్షన్స్ పెంచాలనే ఆలోచన ఎందుకు రావడం లేదన్నారు. 2015 డిసెంబర్ 3న ఆర్భాటంగా ప్రధానమంత్రి ప్రారంభించిన సుగమ్య భారత్ అభియాన్ పథకం అమలుకు నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకునేందుకు నిధులు బడ్జెట్‌లో ఎందుకు కేటాయించలేదని అన్నారు. వికలాంగుల కోసం అమలవుతున్న కేంద్ర ప్రభుత్వ పథకాలకు నిధుల కేటాయింపులో కేంద్ర ప్రభుత్వం వివక్షత చూపిందని చెప్పారు. స్కీం ఫర్ ది ఇంప్లిమెంటేషను ఆఫ్ పర్సన్ విత్ డిజేబుల్స్ యాక్ట్ పథకానికి కేటాయింపులు మరింత తగ్గించడం ఆందోళన కల్గిస్తున్నదని తెలిపారు. 2022-23లో 250.39 కోట్లు, 2024-25లో 135.33 కోట్లు కేటాయిస్తే 2025-26 బడ్జెట్‌లో 115.10 కోట్లకు తగ్గించారని వివరించారు. గత బడ్జెట్‌లో వివిధ కేంద్ర ప్రభుత్వ పథకాలకు 758.01 కోట్లు కేటాయిస్తే ఈ బడ్జెట్‌లో 741.80కోట్లకు తగ్గించారన్నారు. మానసిక వికలాంగుల కోసం అమలవుతున్న ఎలిమెంటల్ హెల్త్ పోగ్రామ్ కోసం గత బడ్జెట్‌లో 90 కోట్లు కేటాయిస్తే 2025-26 బడ్జెట్‌లో 79.60 కోట్లకు తగ్గించారని తెలిపారు. వికలాంగుల జనాభాలో కేవలం 3.8 శాతం మంది వికలాంగులకే వర్తించే ఇందిరా గాంధీ నేషనల్ డిసబుల్డ్ పెన్షన్ స్కీం పథకాన్ని వికలాంగులందరికీ వర్తింప చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టే రాష్ట్ర బడ్జెట్‌లో వికలాంగులకు 5శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. పెన్షన్ పెంపు కోసం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా గౌరవ అధ్యక్షులు రమేష్ బాబు, జిల్లా అధ్యక్షులు రాములు, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.బస్వరాజు, జిల్లా కార్యదర్శి ఎ.గంగాధర్, రాష్ట్ర కమిటీ సభ్యులు బి.సంగప్ప, జిల్లా కోశాధికారి రామ్ పటేల్, జిల్లా ఉపాధ్యక్షులు నజీర్, రాకేష్, సాయమ్మ, ఎల్లయ్య, గోపాల్ యాదవ్, చింటూ, సాయిలు, లక్ష్మణ్, హరీష్, అడప బోర్ర సాయిలు, లకన్, కృష్ణ, రాజు, ప్రకాష్, పటేల్, పాండు, గింజ ఎల్లయ్య, కల్పనా కుమారి, సాగర్‌బాయ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర కార్యద్శి అడివయ్య

రాజీ మార్గమే.. రాజమార్గం

- 8న లోక్ అదాలత్
- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి టీ.నాగరాణి

నవతెలంగాణ-కామారెడ్డి

కక్షిదారులు రాజీ పడదగిన కేసులను రాజీ కుదుర్చుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి టీ.నాగరాణి గురువారం సూచించారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలో మొత్తంగా 7 బెంచీలతో 8న లోక్ అదాలత్ నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రత్యామ్నాయ వివాద పరిష్కార మార్గాలలో లోక్ అదాలత్ ఒకటి అన్నారు. లోక్ అదాలత్ ద్వారా జ్యుడీషియల్ అధికారులు, న్యాయవాదులు, సామాజిక కార్యకర్తలతో కూడిన లోక్ అదాలత్ బెంచ్‌లు వారికి సూచించబడిన కేసులను పరిష్కరిస్తాయని తెలిపారు. సెటిల్‌మెంట్‌కు చేరుకోవడంలో పార్టీలకు సహాయ పడతాయన్నారు. లోక్ అదాలత్‌లకు ఏదైనా కోర్టు ముందు పెండింగ్‌లో ఉన్న కేసు లేదా ఏదైనా కోర్టు అధికార పరిధిలోకి వచ్చే అటువంటి కోర్టు ముందు తీసుకురాని ఏదైనా విషయానికి సంబంధించి వివాదానికి సంబంధించిన పార్టీల మధ్య రాజీ లేదా పరిష్కారాన్ని నిర్ణయించడానికి చేరుకోవడానికి అధికార పరిధి ఈ లోక్ అదాలత్‌కి ఉంటుందని పేర్కొన్నారు. ఈ లోక్ అదాలత్‌లో అన్ని సివిల్ కేసులు, వైవాహిక వివాదాలు, భూ వివాదాలు, విభజన, ఆస్తి వివాదాలు, కార్మిక వివాదాలు, బ్యాంకు రికవరీ వివాదాలు మొదలైన వాటిని పరిష్కారం చేసుకోవచ్చని సూచించారు.

పెండింగ్‌లో ఉన్న కేసులను పరిష్కరించే వేదిక లోక్ అదాలత్‌లో కేసు దాఖలు చేసినప్పుడు కోర్టు రుసుము చెల్లించాల్సిన అవసరం లేదని తెలిపారు. న్యాయస్థానంలో పెండింగ్‌లో ఉన్న విషయం లోక్ అదాలత్‌కు పంపబడి, ఆ తర్వాత పరిష్కరించబడినట్లయితే, ఫిర్యాదులు, పిటీషన్‌పై వాస్తవానికి కోర్టులో చెల్లించిన కోర్టు రుసుము కూడా పార్టీలకు తిరిగి చెల్లించబడుతుందని పేర్కొన్నారు. సైబర్ క్రైమ్ బాధితులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

విద్యార్థులకు ఉచిత రవాణా సౌకర్యం

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని రంగంపేట గ్రామానికి చెందిన విద్యార్థులు పక్కనే గల పోసానిపేటలో చదువుకోవడానికి వివిధ మార్గాల ద్వారా వెళ్లేవారు. వారి ఇబ్బందులను గమనించిన గ్రామస్తుడు షేక్ ఫైజోద్దీన్ విద్యార్థులకు ఉచిత రవాణా సౌకర్యం కోసం తన స్వంత వాహనంలో ఉదయం రెండు ట్రిప్పులు, సాయంత్రం రెండు ట్రిప్పులు ఏర్పాటు చేసి విద్యార్థులకు రవాణా సౌకర్యం కల్పించారు. గత నెల నుంచి విద్యార్థులకు రవాణా సౌకర్యం కల్పించడం పట్ల విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు, గ్రామస్తులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఆయనను అభినందించారు.



'సారీ మమ్మీ.. డాడీ'

- ఇక సెలవు.. అంటూ తల్లిదండ్రులకు కుమారుడి లేఖ
- సంగారెడ్డిలో ఉంటున్న పిట్లం వాసి అదృశ్యం

నవతెలంగాణ-పిట్లం

ఉద్యోగం రాలేదన్న మనస్థాపంతో తల్లిదండ్రులకు 'సారీ మమ్మీ.. డాడీ, ఇక సెలవు. అంటూ లేఖ రాసి ఇంట్లో నుంచి అదృశ్యమయ్యాడు ఓ నిరుద్యోగి. స్థానికులు, బంధువుల వివరాల ప్రకారం.. పిట్లం మండలంలోని కోమటి చెరువు తాండకు చెందిన సునావత్ గోవింద్, మారుని భాయ్ దంపతుల కుమారుడు సునావత్ అశోక్ (32) ప్రస్తుతం సంగారెడ్డిలో ఆర్టీసీ కాలనీ గొల్లగూడెం పోతిరెడ్డిపల్లిలో యంఎస్ఎన్ ఫార్మా కంపెనీలో ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ ప్రభుత్వ ఉద్యోగం నిమిత్తం పలుసార్లు పోటీ పరీక్షలు రాశాడు. ఉద్యోగం రాలేదన్న మనస్థాపంతో 'సారీ మమ్మీ, డాడీ.. ఇక సెలవు'. అని లేఖ రాసి ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. మూడు రోజులైనప్పటికీ ఆయన ఆచూకీ తెలువలేదు. దీంతో అదృశ్యమైన ఘటన నిమిత్తం సంగారెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేయటంతో పోలీసులు సీసీ ఫుటేజ్‌లను పరిశీలిస్తున్నారు. గాలింపు చర్యలు చేపట్టారు.



మొరం టిప్పర్లను అడ్డుకున్న గ్రామస్తులు

- ఘటనా స్థలాన్ని సందర్శించిన అధికారులు
- ఏడు టిప్పర్లు స్వాధీనం


అధికారులతో మాట్లాడుతున్న గ్రామస్తులు

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని ఖజానా కుంట నుంచి గ్రామంలోని మొరం రోడ్ల కోసం అధికారుల అనుమతితో మొరం తవ్వకాలను చేపట్టగా.. నీల గ్రామానికి చెందిన బోయలు, గ్రామస్తులు అక్రమంగా మొరం తరలిస్తున్నారంటూ అడ్డుకున్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకే మొరం పనులను చేపట్టామని స్థానిక కాంగ్రెస్ నాయకులు పేర్కొనగా.. కొందరు డబ్బులకు కక్కుర్తి పడి మొరం అమ్ముకున్నట్లు తమ దృష్టికి వచ్చిందని గ్రామస్తులు స్పష్టం చేయడంతో మొరం పనులను నిలిపివేశారు. గురువారం ఉదయం నీటిపారుదల శాఖ ఈఈ బలరాం, ఎస్సై ఈ సాయన్న సమక్షంలో గ్రామస్తులు చర్చలు జరిపారు. ఖజానా కుంట ప్రధానమైన గొలుసు కట్టు చెరువని, దీని ద్వారానే ఇతర చెరువులకు నీరు వస్తుందని వారు అధికారులకు తెలియజేయడంతో.. ఘటనా స్థలాన్ని పరిశీలించిన అధికారులు చెరువులోకి వెళ్లే ప్రధాన కాలువ మరమ్మతులు చేపట్టి ఇక నుంచి మొరం తరలించకుండా జాగ్రత్తలు తీసుకుంటామని హామీనివ్వడంతో సమస్య కొలిక్కి వచ్చింది.

టిప్పర్ల స్వాధీనం..

గ్రామాలలోకి వెళ్లే ప్రధాన రోడ్ల మొరం పనులు చేపట్టడానికి అధికారులు అనుమతులు ఇచ్చినప్పటికీ, ఒకరిద్దరి కక్కుర్తి పనుల వల్ల గ్రామస్తులు అడ్డుకోవడంతో ఘటనా స్థలంలోనున్న ఏడు టిప్పర్లను స్వాధీనం చేసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు నీటి పారుదల శాఖ ఈఈ బలరాం పేర్కొన్నారు.


స్వాధీనం చేసుకున్న టిప్పర్లు

ఇందిరమ్మ ఇళ్లకు భూమి పూజ



భూమి పూజ చేస్తున్న నాయకులు

నవతెలంగాణ-బాల్కొండ

తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలలో ఒకటైన ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలుకు శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా మండల పరిధిలో జలాల్ పూర్ గ్రామం పైలెట్ ప్రాజెక్టుకు ఎంపికైంది. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగియడంతో గురువారం గ్రామంలో మంజూరైన ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలకు కాంగ్రెస్ పార్టీ నాయకులు భూమి పూజ నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ పంచాయితీ కార్యదర్శి దేవేందర్, కారోబార్ వేణుగోపాల్, గ్రామ కాంగ్రెస్ సీనియర్ నాయకులు మోహన్ రెడ్డి, రంజిత్ కుమార్ కత్తి, దేవేందర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ రాటం సాగర్, మాజీ సర్పంచ్ జక్క చిన్న గంగారం, శ్రీనివాస్, అనంత్ రెడ్డి, భోజన్న, లక్ష్మణ్, బాలు, రవి, రాజా సాబ్, సాయిరాం పాల్గొన్నారు.

బోరు మరమ్మతు పనులను పరిశీలించిన అదనపు కలెక్టర్



పనులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలో బోరు మరమ్మత్తు పనులను జిల్లా అదనపు కలెక్టర్, ప్రత్యేక అధికారి అంకిత్, మున్సిపల్ కమిషనర్ రాజుతో కలిసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ.. రాబోయే వేసవికాలం దృష్ట్యా నీటి సమస్య లేకుండా చర్యలు చేపడుతున్నామన్నారు. సమస్యలు తమ దృష్టికి వస్తే వెంటనే పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కంప్యూటర్ సైన్స్ డీన్‌గా సంపత్ కుమార్ నియామకం

నవతెలంగాణ-డిచ్‌పల్లి



నియామక పత్రం అందజేస్తున్న వీసీ

తెలంగాణ వర్సిటీ తెలంగాణ యూనివర్సిటీ డీన్ ఫ్యాకల్టీ అఫ్ సైన్సెస్ మరియు కంప్యూటర్ సైన్స్‌కు ప్రొఫెసర్ కే సంపత్ కుమార్‌ను నియమిస్తూ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ప్రొఫెసర్ టి. యాదగిరి రావు నియామకపు ఉత్తర్వులను గురువారం అందించారు. ప్రొఫెసర్ కే సంపత్ కుమార్ డిపార్ట్మెంట్ ఆఫ్ స్టాటిస్టిక్స్‌లో ప్రొఫెసర్‌గా కొనసాగుతున్నారు. వీరు ప్రస్తుతం యూనివర్సిటీ డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్‌గా, పరీక్షల నియంత్రణ అధికారిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. గతంలో అప్లైడ్ స్టాటిసిక్స్ హెడ్‌గా, బోర్డ్ ఆఫ్ స్టడీస్, చైర్మన్‌గా, పిఆర్ ఓగా, నోడల్ ఆఫీసర్‌గా పరీక్షల నియంత్రణ అధికారిగా వైస్ ప్రిన్సిపాల్‌గా, పబ్లికేషన్ డైరెక్టర్ గా విధులు నిర్వహించారు.

మాజీమంత్రి సుదర్శన్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న బిజెపి నాయకులు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద మాజీమంత్రి బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి దిష్టిబొమ్మను బిజెపి మండల ఉపాధ్యక్షుడు జై డి గంగారెడ్డి ఆధ్వర్యంలో దహనం చేశారు. ఈ సందర్భంగా జెడి గంగారెడ్డి మాట్లాడుతూ ఎంపీ అరవింద్ కష్టపడి మండలానికి జవహర్ నవోదయ పాఠశాలను మంజూరు చేయిస్తే, అది కాస్త బోధన్ నియోజకవర్గానికి తరలించడానికి ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి ప్రయత్నాలు చేస్తున్నాడని ఆరోపించారు. జక్రాన్ పల్లి మండలం నుంచి జవహర్ నవోదయ పాఠశాలను తరలిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు కన్నేపల్లి ప్రసాద్, కుంట శ్రీనివాస్, కాల్వ ఆనంద్, తిరుపతిరెడ్డి, వేంపల్లి శ్రీనివాస్ గౌడ్, వేణు తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ యూనిఫాం కుట్టడంలో నైపుణ్యం పెంపొందించుకోవాలి




మాట్లాడుతున్న డిఆర్డిఓ సాయగౌడ్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

స్వయం సహాయక సంఘాల సభ్యులు ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు యూనిఫారం కుట్టడంలో నైపుణ్యం పెంచుకోవాలని, నాణ్యమైన దుస్తులు సకాలంలో పంపిణీ చేయాలని కోరారు. స్థానిక కలెక్టర్ కార్యాలయంలో గల సమావేశ మందిరంలో అన్ని మండల సమాఖ్యలకు చెందిన మాస్టర్ ట్రెయినర్స్‌కు జరిగిన టైలరింగ్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం సభ్యులను ఉద్దేశించి డిఆర్డిఓ సాయగౌడ్ మాట్లాడుతూ.. మహిళలకు టైలరింగ్‌లో బల్క్ కట్టింగ్, ఖాజా, బటన్ కుట్టడంలో శిక్షణ ఇస్తున్నామని ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ శిక్షణను మాస్టర్ ట్రైనర్లు రెండు రోజుల పాటు ఇవ్వనున్నారు. కార్యక్రమంలో ఏడిఆర్డిఓ రవీందర్, డీపీయం సాయిలు, ఎపిఎం రాజేందర్, శిక్షకులు మాధవి, లత, పద్మ, సుజాత, మంజుల అన్ని మండలాల్లోని మహిళా టైలర్లు పాల్గొన్నారు.

అఖిల భారత పద్మశాలి మహాసభకు రండి

- సీఎం రేవంత్‌రెడ్డికి పద్మశాలీల ఆహ్వానం
- 9న నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో 17వ మహాసభ



సీఎంను కలిసిన పద్మశాలీల సంఘ సభ్యులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ ఈరవత్రి అనిల్ ఆధ్వర్యంలో గురువారం అఖిల భారత పద్మశాలి సంఘం, తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం నాయకులు హైదరాబాద్ లోని స్వగృహంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిశారు. ఈనెల 9న నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్ లో జరగబోయే 17వ అఖిల భారత పద్మశాలి మహాసభ, 8వ తెలంగాణ ప్రాంత పద్మశాలి మహాసభలకు ముఖ్య అతిథిగా రావాలని ఆహ్వానించారు. మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆహ్వాన పత్రాన్ని అఖిల భారత పద్మశాలి సంఘం అధ్యక్షులు కందగట్ల స్వామి, తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం అధ్యక్షులు కమర్తపు మురళి అందజేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసిన వారిలో వరంగల్ మేయర్ గుండు సుధారాణి, అఖిల భారత పద్మశాలి సంఘం ప్రధాన కార్యదర్శి గడ్డం జగన్నాథం, ఉపాధ్యక్షులు గుండు ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్‌లో 420 మంది విద్యార్థులు గైర్హాజరు

- పరీక్షాకేంద్రాలు తనిఖీ చేసిన అధికారులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరం తెలుగు, హిందీ, సంస్కృతం, ఉర్దూ భాష సబ్జెక్టుతో పరీక్ష లు గురువారం నిర్వహించారు. జిల్లా ఇంటర్ విద్య అధికారి తిరుమలపుడి రవికుమార్ తెలిపారు. 420మంది విద్యార్థులు గైర్హాజరు కాగా ఒక విద్యార్థి చీటీలు రాయగా పట్టుకుని మాల్ ప్రాక్టీస్ కేసు నమోదు చేశామని అన్నారు. మొత్తం జిల్లాలో 16,343 మంది విద్యార్థులకు గాను 15,923 విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారని అన్నారు. మొత్తం 97.4 శాతం విద్యార్థులు పరీక్షలు రాయగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా పరీక్షలు నిర్వహించామని తెలిపారు. కలెక్టర్ ధర్మారంలోని సాంఘిక సంక్షేమ జూనియర్ కళాశాల తనిఖీ చేసి పరీక్షల నిర్వహణ పట్ల సం తృప్తి ని వ్యక్తం చేశారు. జిల్లాలో మొత్తం 57 పరీక్ష కేంద్రాలకు గాను 49 పరీక్ష కేంద్రాలను తనిఖీలు చేశారు. నిజామాబాద్ ఖిల్లా ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల-బీ సెంటర్‌లో ఓ విద్యార్థి చీటీలు రాస్తుండగా ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం పట్టుకుని మాల్ ప్రాక్టీస్ కేసు నమోదు చేసింది. జిల్లా పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులతో పాటు తాను ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్‌లు, హై పవర్ కమిటీ, బల్క్ అధికారి, కస్టోడియన్లు తనిఖీ చేసి పర్యవేక్షణ చేశారని జిల్లా ఇంటర్ విద్యా అధికారి తెలియజేశారు.

జిల్లా ఇంటర్ విద్యా అధికారి రవికుమార్ నిజామాబాద్ పట్టణంలోని ఖిల్లా ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల -ఏ సెంటర్, బి సెంటర్, నిజామాబాద్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, కంఠేశ్వర్ లోని ఎస్సార్ జూనియర్ కళాశాలలను, రవి కాకతీయ జూనియర్ కళాశాల-ఏ సెంటర్, బీ సెంటర్, మహిళా కాకతీయ జూనియర్ కళాశాలలను తనిఖీ చేసి సమీక్షించారు. పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులు చిన్నయ్య, రజీయుదిన్ అస్లాం, కనకమహాలక్ష్మి పది పరీక్ష కేంద్రాలను తనిఖీ చేయగా హైపవర్ కమిటీ శ్రీనాథ్ ఆధ్వర్యంలో నాలుగు పరీక్ష కేంద్రాలను, మూడు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు నర్సయ్య, బాలాజీ, యమున బృందం 19 పరీక్ష కేంద్రాలను, సిటింగ్ స్కాడ్ బృందాలు ఆరు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. బల్క్ అధికారి బుద్ధిరాజ్ మూడు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసి సమీక్షించారు. కాగా నిజామాబాద్ మున్సిపల్ కమిషనర్ పలు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసి సమీక్షించారు.

తప్పుడు ప్రచారాలతో అడ్మిషన్లు చేస్తున్న

ప్రెసిడెన్సి స్కూల్‌పై చర్యలు తీసుకోవాలి

- ఏఐఎస్ఎఫ్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

ప్రెసిడెన్సి విద్యసంస్థల యాజమాన్యం తప్పుడు ప్రచారాలతో అడ్మిషన్లు నిర్వహిస్తు విద్యార్థులను మోసం చేస్తున్న ప్రెసిడెన్సి యజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు వినతిపత్రం అందజేశారు. అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) ఆధ్వర్యంలో నిజామాబాద్ జిల్లా కలెక్టర్‌కు ప్రెసిడెన్సీ విద్యాసంస్థల మీదా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రఘురాం నాయక్ మాట్లాడుతూ.. నిజామాబాద్ రూరల్ మండలం భారతీ గార్డెన్ దగ్గర (ప్రెసిడెన్సీ గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్) పేరుతో ప్రెసిడెన్సీ ఇంటర్నేషనల్ (ఆరావళి క్యాంపస్)స్కూల్ ఈ స్కూల్‌కు విద్యాశాఖ నుండి ఎటువంటి అనుమతి లేకున్నా బిల్డింగ్ పూర్తికాకముందే అడ్మిషన్లు నిర్వహిస్తున్నారు. 50 శాతం ఫీజు ముందే వసూలు చేస్తున్న ప్రెసిడెన్సి స్కూల్ యజమాన్యంపైన క్రిమినల్ కేసు నమోదు చేయాలని, నిజామాబాద్ నగరంలో పెట్టిన హోర్డింగ్‌లు తొలగించాలని కలెక్టర్‌ను కోరారు. కలెక్టర్ స్పందిస్తూ జిల్లా విద్యాశాఖ అధికారి తో మాట్లాడి ప్రెసిడెన్సీ విద్యాసంస్థల మీద వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారని అన్నారు. విద్యాశాఖ అధికారులు వెంటనే స్పందించకపోతే విద్యాశాఖ కార్యాలయం ముట్టడి చేస్తామని తెలిపారు. 2025-2026 సంవత్సరానికి సంబంధించి విద్యాశాఖ నుండి ఆన్లైన్లో దరఖాస్తు చేసుకునే ప్రక్రియ ముగిసింది కావున విద్యార్థుల తల్లిదండ్రులు గమనించాలని కోరారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షురాలు అంజలి, నాయకులు సుభోద్, కుశాల్, శివాజీ పాల్గొన్నారు.

రేపు జాతీయ లోక్ అదాలత్..

కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలి

- నిజామాబాద్ జిల్లా జడ్జి సునీత కుంచాల

నవతెలంగాణ-కంఠేశ్వర్



మాట్లాడుతున్న జిల్లా జడ్జి సునీత కుంచాల

ఈ నెల 8న జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను కక్షి దారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా జడ్జి సునీత కుంచాల పిలుపునిచ్చారు. గురువారం నగరంలోని జిల్లా కోర్టు ప్రాంగణంలో గల న్యాయ సేవ అధికార సంస్థ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వివిధ కోర్టుల్లో దీర్ఘకాలికంగా కొనసాగుతున్న అపరిష్కృత కేసుల సత్వర పరిష్కారం కోసం జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.భూమి తగాదాలు, చెక్ బౌన్స్, బ్యాంక్ లీగల్ యాక్షన్ రుణాలకు సంబంధించి మెయింటెనెన్స్ తదితర కేసులు పరిష్కరించబడతాయని అన్నారు. అదేవిధంగా కొందరు వివిధ ప్రాంతాల్లో వివిధ పనుల నిమిత్తం ఉండి ఇక్కడికి వచ్చే అవకాశం లేని వారికి లోక్ అదాలత్ ద్వారా వెసులుబాటు కల్పించడం జరుగుతుందన్నారు. అలాంటి వారికి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాజీ పద్ధతిలో కేసు పరిష్కరించడం జరుగుతుందని వివరించారు. ఇరుపక్షాల వారు రాజీ ఉన్నప్పుడే రాజీ మార్గం సులువు అవుతుందని తెలిపారు. రోడ్డు ప్రమాదాలను సంబంధించి నష్ట పరిహారం కోసం వేసిన కేసుల్లోని బాధితులు న్యాయ సేవా సంస్థను ఆశ్రయిస్తే నెల రోజుల వ్యవధిలో పూర్తి మొత్తం లో డబ్బులు వచ్చే అవకాశం ఉంటుందన్నారు. అదేవిధంగా సైబర్ క్రైమ్ సంబంధించిన కేసుల్లో కూడా న్యాయ సేవా సంస్థను సంప్రదిస్తే వారికి కూడా న్యాయం జరిగే విధంగా కృషి చేస్తామన్నారు. 3 నెలల ఒక సారి వచ్చే జాతీయ లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలనీ, ఈ అవకాశాన్ని కేసులలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నవారు వినియోగించుకోవాలన్నారు. సమావేశంలో న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి పద్మావతి, కోర్టు సిబ్బంది నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలుంటే రాసి ఫిర్యాదు బాక్సులో వేయండి

- ఎంపీడీవో శ్రీనివాస్, తహసిల్దార్ ఆంజనేయులు



పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో శ్రీనివాస్, తహసీల్దార్

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

విద్యార్థులు తమకు ఏమైనా ఇబ్బందులు ఉంటే ఫిర్యాదు రూపంలో రాసి ఫిర్యాదు బాక్సులో వేయాలని ఎంపీడీవో చింత రాజ శ్రీనివాస్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంను తహసిల్దార్ ఆంజనేయులు తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో తరగతి గదులను సందర్శించిన వారు పదవ తరగతి విద్యార్థులతో ముచ్చటించారు. పదవ తరగతి విద్యార్థులకు ప్రీ ఫైనల్ ఎగ్జామినేషన్ నిర్వహణ తీరును వారు పరిశీలించారు. బాగా చదివి పరీక్షలను మంచిగా రాయడం ద్వారా ఉత్తమ మార్కులు సాధించాలని విద్యార్థులకు సూచించారు. తద్వారా పాఠశాలకు, కన్న తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యార్థులు పాఠశాలలో తమ ఇబ్బందులను తెలియజేసినందుకు ఏర్పాటు చేసిన ఫిర్యాదుల బాక్సును తెరిచి అందులో ఎలాంటి ఫిర్యాదులు లేకపోవడం గమనించారు. పాఠశాల విద్యార్థుల కోసం వండి సిద్ధం చేసిన ఆహార పదార్థాలను తనిఖీ చేశారు. పరిశుభ్రమైన వాతావరణంలో నాణ్యతతో కూడిన ఆహార పదార్థాలను తయారు చేసి విద్యార్థులకు అందించాలని మధ్యాహ్న భోజనం నిర్వాహకులకు సూచించారు. వంటపాత్రలను కూడా శుభ్రంగా కడగాలన్నారు. పాఠశాలకు సరఫరా అయిన పప్పుధాన్యాలను, ఆహార పదార్థాలను పరిశీలించి, స్టాక్ రిజిస్టర్ తనిఖీ చేశారు. పాఠశాలలో ఉండే విద్యార్థులను తమ సొంత పిల్లగా చూసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే వెంటనే విద్యార్థులు ఫిర్యాదు రూపకంగా రాసి ఫిర్యాదు బాక్స్ లో వేయాలని విద్యార్థులకు అవగాహన కల్పించారు

జీవితంపై విరక్తి చెంది మహిళ ఆత్మహత్య

నవతెలంగాణ-మాక్లూర్

అనారోగ్య సమస్యలతో బాధపడుతూ మహిళ కాలువలో దూకి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలోని దర్మోరా గ్రామంలో బుధవారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం మండల పరిధిలోని చిక్లి గ్రామానికి చెందిన సాదుల్ల సుశీల గత కొంత కాలంగా అనారోగ్య సమస్యలతో బాధ పడుతూ జీవితంపై విరక్తి చెంది మార్చ్ 2 వ తేదీన ఇంట్లో నుండి వెళ్లింది. నందిపేట్ వద్ద కాలువలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. మృత దేహం మార్చ్ 5న మండల పరిధిలో ధర్మోరా గ్రామ శివారులోని కాలువలో లభ్యమైంది. మృతురాలి కుమారుడు సందీప్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు మాక్లూర్ ఎస్సై రాజశేఖర్ పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



నవతెలంగాణ-ఎడపల్లి

మండలంలోని జానకంపేట్ గ్రామ శివారులో ఘోర రోడ్డు ప్రమాదం బుధవారం రాత్రి చోటుచేసుకుంది. తానాకలాన్ గ్రామానికి చెందిన మెట్టు శ్రీనివాస్ (26) అనే యువకుడు విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ద్విచక్ర వాహనంపై జానకంపేట్ నుంచి తానాకలన్ గ్రామానికి వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం బలంగా ఢీకొట్టింది. తీవ్ర గాయాలపాలైన శ్రీనివాస్ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకొని వివరాలను సేకరించారు. పోలీసులు విచారణ ప్రారంభించారు.

రోడ్డు రోలర్‌తో సైలెన్సర్లు ధ్వంసం

- మితిమీరిన శబ్దంతో వాహనాలకు సైలెన్సర్లను ఉపయోగిస్తే చర్యలు తప్పవు
- నిజామాబాద్ ట్రాఫిక్ ఏసిపి నారాయణ



సైలెన్సర్లను ధ్వంసం చేస్తున్న రోడ్డు రోరల్

నవతెలంగాణ-కంఠేశ్వర్

మితిమీరిన శబ్దంగాల సైలెన్సర్లను వాహనదారులు ఉపయోగిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని నిజామాబాద్ ట్రాఫిక్ ఏసిపి నారాయణ అన్నారు. గురువారం నిబంధనలకు విరుద్ధంగా ద్విచక్రవాహనాలకు సైలెన్సర్లను ఏర్పాటు చేసి శబ్ద కాలుష్యానికి కారణమవుతున్న బైకర్లపై పోలీసులు పంజా విసిరారు. వాహనాల సైలెన్సర్లను తీసివేయించి వాటిని స్వాధీనం చేసుకున్నారు. మొత్తం 240 సైలెన్సర్లను నగరంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో రోడ్డు రోలర్ తో ధ్వంసం చేయించారు. నిబంధనలకు విరుద్ధంగా సైలెన్సర్లు ఏర్పాటు చేసి శబ్ద కాలుష్యానికి కారణమయ్యే వాహనదారులతోపాటు షోరూమ్‌ల నిర్వాహకులు, మెకానిక్‌లపై చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ ఏసీపీ హెచ్చరించారు. వాహనదారులు ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించి ట్రాఫిక్ పోలీసులకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సిఐ ప్రసాద్, ట్రాఫిక్ ఎస్ఐ సుమన్, ట్రాఫిక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్‌గా సిహెచ్ లక్ష్మణ్ చక్రవర్తి నియామకం

నవతెలంగాణ-డిచ్‌పల్లి



తెలంగాణ యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ గా డాక్టర్ సిహెచ్ లక్ష్మణ్ చక్రవర్తిని నియమిస్తూ వైస్ ఛాన్స్ లర్ ప్రొఫెసర్ టి యాదగిరి రావు నియామకపు ఉత్తర్వులు గురువారం అందించారు. ప్రస్తు తం తెలంగాణ యూనివర్సిటీ తెలుగు విభాగంలో విభాగాధి పతిగా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ సిహెచ్ లక్ష్మణ్ చక్రవర్తి గతంలో పాఠ్య ప్రణాళిక సంఘం చైర్మన్‌గా ప్లేస్మెంట్ సెల్ డైరెక్టర్ గా విధులు నిర్వహించినారు.ఈ సందర్భంగా డాక్టర్ సిహెచ్ లక్ష్మణ్ చక్రవర్తి మాట్లాడుతూ నా మీద నమ్మకంతో నియామకపు ఉత్తర్వులు అందించిన వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ టి యాదగిరిరావుకు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం యాదగిరి కి కృతజ్ఞతలు తెలిపారు.

ఇందిరమ్మ ఇండ్లకు మార్కౌట్ చేసుకోవాలి



ఇంటి స్థలాలను పరిశీలిస్తున్న ఎంపీడీవో

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని నాగాపూర్‌లో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఇంటి స్థలాలను ఎంపీడీవో చింత రాజ శ్రీనివాస్ గురువారం పరిశీలించారు. నాగపూర్ గ్రామాన్ని మండలంలో పైలట్ ప్రాజెక్టు గ్రామంగా గుర్తించి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని చేపట్టిన విషయం తెలిసిందే. ప్రజా పాలన దరఖాస్తుల్లో భాగంగా ఇండ్ల నిర్మాణం కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులను గుర్తించి ఇండ్లను మంజూరు చేశారు. ఇందిరమ్మ ఇండ్లు మంజూరై ఇంటి స్థలాలు ఉన్న లబ్ధిదారులతో ఎంపీడీవో మాట్లాడారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను త్వరత గతిన చేపట్టాలని, ఇందుకు ఇండ్ల నిర్మాణం కోసం మార్కౌట్ పనులను పూర్తి చేసుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన పలువురు లబ్ధిదారుల ఇంటి స్థలాలను ఆయన పరిశీలించారు. స్థలాలను శుభ్రం చేసుకొని, నిర్మాణం కోసం ముగ్గురు పోసుకునే కార్యక్రమాన్ని త్వరగా పూర్తి చేసుకోవాలని సూచించారు. తద్వారా ఇండ్ల నిర్మాణాలను చేపట్టేందుకు వీలుంటుంది అన్నారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి సంధ్య, తదితరులు ఉన్నారు.

ఆశ ప్రైమ్ హాస్పిటల్ ఆధ్వర్యంలో పిల్లలకు వైద్య శిబిరం

నవతెలంగాణ-ఆర్మూర్



పిల్లలకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

పట్టణంలోని ఆశా ప్రైమ్ హాస్పిటల్ ఆధ్వర్యంలో వైద్యులు కే. క్రాంతి కుమార్ పర్యవేక్షణలో పెర్కిట్ కాంతి హై స్కూల్‌లో గురువారం ఉచిత పిల్లల వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వైద్యులు విద్యార్థులను పరీక్షించి వారికి ఆరోగ్య రిత్యా తీసుకోవాల్సిన తగు జాగ్రత్తలను సూచనలను తెలిపారు. ఎదిగే వయసులో పిల్లలకు సరైన పోషకాహారం చాలా అవసరమని, వారికి తగిన ఆహారం అందేలా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. డైరెక్టర్ శశాంక్ మాట్లాడుతూ.. మంచి సలహాలు సూచనలు చేసి, సరైన ఇన్ఫర్మేషన్ ఇచ్చిన వైద్యున్ని అభినందించారు. వారి సేవలను కొనియాడుతూ వారి సూచనలను పాటిస్తూ విద్యార్థులు ఆరోగ్యవంతంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో 400కు పైగా పిల్లలను ఉచితంగా పరీక్షించి వారికి తగిన సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కామారెడ్డి
శుక్రవారం | మార్చి 07, 2025 | www.navatelangana.com

డిగ్రీ ఫలితాల్లో సాందీపని ప్రభంజనం


అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు

నవతెలంగాణ-కామారెడ్డి

తెలంగాణ యూనివర్సిటీ శుక్రవారం ప్రకటించిన డిగ్రీ సెమిస్టర్ 1,3,5 ఫలితాలలో కామారెడ్డి జిల్లా కేంద్రంలోని సాందీపని డిగ్రీ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలను సాధించి, ఉత్తీర్ణత శాతాన్ని నమోదు చేశారు. ఎంఎస్‌టిసిఎస్ మొదటి సంవత్సరం సెమిస్టర్ -1 విభాగంలో రిమ్న మహీన్ 10కి 10 ఎస్ జీపీఏ, ఎన్ జెడ్‌సి మొదటి సంవత్సరం సెమిస్టర్ -1 విభాగంలో మ్యాదరి స్నేహ 10కి 10 ఎస్‌జీపీఏ, అఫీరా మాలిక్ 10కి గాను 9.84 ఎస్‌జీపీఏ, బీకాం తృతీయ సంవత్సరం సెమిస్టర్ -5 విభాగంలో 10కి గాను 9.72 ఎస్‌జీపీఏ మార్కులను సాధించారు. యూనివర్సిటీ పరిధిలో మొదటి ర్యాంకును సాధించిన విద్యార్థులను కళాశాల డైరెక్టర్ ఆర్.హరిస్మరణ్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ సాయిబాబు, అకాడమిక్ ప్రిన్సిపాల్ మనోజ్ కుమార్, ఉపన్యాసకులు, విద్యార్థులు అభినందించారు.

మెడికల్ షాపులపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-బాన్సువాడ (నసురుల్లాబాద్)



బాన్సువాడ మండల కేంద్రంలో బినామీ ఫార్మసీ పత్రాలతో మెడికల్ షాపులు నిర్వహిస్తున్నారని కన్స్యూమర్ రైట్ ప్రొటెక్షన్ ఫోరం బాన్సువాడ డివిజన్ ఇన్‌ఛార్జ్ మేకల సాయిలు బాన్సువాడ సబ్ కలెక్టర్ కార్యాలయంలో గురువారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సాయిలు మాట్లాడుతూ డ్రగ్ కంట్రోల్ ఆఫ్ తెలంగాణ, డ్రగ్ కంట్రోల్ ఆఫ్ ఇండియా నిర్ధారించిన అర్హత ప్రమాణాలకు విరుద్ధంగా మెడికల్ షాపులు నిర్వహిస్తున్న వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని సబ్ కలెక్టర్ కార్యాలయంలో సూపరింటెండెంట్‌కు ఆయన ఫిర్యాదు చేశారు.

ప్రారంభమైన సెకండియర్ పరీక్షలు

నవతెలంగాణ-విలేకరుల బృందం



తాద్వాయి: పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులను తనికీ చేస్తున్న అధికారులు, రామారెడ్డి: పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

కామారెడ్డి : ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం వార్షిక పరీక్షలు ప్రశాంతంగా బుధవారం ప్రారంభమయ్యాయని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ తెలిపారు. గురువారం ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం లాంగ్వేజ్ పరీక్ష నిర్వహించినట్టు తెలిపారు. జిల్లాలోని 38 కేంద్రాలలో 7949 మంది విద్యార్థులకు గాను 7789 మంది విద్యార్థులు హాజరు కాగా, 160 మంది గైర్ హాజరయ్యారని తెలిపారు. ఇందులో 7278 మంది విద్యార్థులు జనరల్ అభ్యర్థులకు గాను 7137 మంది హాజరు అయ్యారని, 141 మంది గైర్ హాజరు అయ్యారని, వొకేషనల్ కోర్సులో 671 మందికి గాను 652 మంది హాజరు కాగా, 19 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని పేర్కొన్నారు.

తాద్వాయి : మండల కేంద్రంలోని బాలికల గురుకుల పాఠశాలలో గురువారం ఇంటర్మీడియట్ తెలుగు పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్టు డిపార్ట్మెంటల్ ఆఫీసర్ సుజాత తెలిపారు. 209 మంది విద్యార్థిని విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 208 మంది హాజరయ్యారని, ఒకరు గైర్హాజరు అయ్యారని పేర్కొన్నారు. కేంద్రం వద్ద 144 సెక్షన్ విధించగా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారని ప్రిన్సిపాల్ బి.సురేఖ తెలిపారు.

నిజాంసాగర్ : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరం మొదటి పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ శివకుమార్ తెలిపారు. మొత్తం 163 మంది విద్యార్థులు పరీక్ష రాయల్సి ఉండగా 161 మంది విద్యార్థులు పరీక్ష రాశారని.. ఇద్దరు విద్యార్థులు మాత్రమే పరీక్షకు గైర్హాజరు అయ్యారని ఆయన తెలిపారు. మాస్ కాపీయింగ్‌కు పాల్పడకుండా పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు.

పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసిన పలువురు అధికారులు..

రామారెడ్డి : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ రెండవ సంవత్సర విద్యార్థులకు మొదటి రోజు పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. 123 మంది విద్యార్థులకు 123 మంది విద్యార్థులు హాజరైనట్లు ఇంచార్జ్ రమేష్ తెలిపారు. పరీక్ష కేంద్రాన్ని తహసిల్దార్ సువర్ణ, రవి కిరణ్, ఫ్లయింగ్ స్క్వాడ్, సిట్టింగ్స్ స్క్వాడ్ పర్యవేక్షించారు.

ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య

నవతెలంగాణ-భిక్కనూర్

ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని జంగంపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు, గ్రామస్తులు, కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన శ్రావణ్ (23) కల్లు దుకాణంలో కూలి పని చేస్తూ జీవిస్తున్నాడు. మతిస్థిమితం లేని కారణంగా మద్యానికి బానిసై ఆత్మహత్య చేసుకుందామని చాలాసార్లు ప్రయత్నించారు. గురువారం కుటుంబీకులు తెల్లవారుజామున ఇంటి ముందు ఉన్న కొట్టంలో చూసేసరికి శ్రావణ్ ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఫార్మేషన్ రోడ్డు పనులు పరిశీలన

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

మండలంలోని కన్నారెడ్డి, రాఘవపల్లి, బెజుగాం చెరువు తండా గ్రామాలలో నిర్వహిస్తున్న ఫార్మేషన్ రోడ్డు పనులను గురువారం ఎంపీడీవో ప్రభాకర్ చారి పరిశీలించారు. ఎత్తు వంపులు లేకుండా సమానంగా రోడ్డును వేయాలని సంబంధిత అధికారులకు ఆయన ఆదేశించారు.

మొక్కలు ఎండిపోతే చర్యలు

నవతెలంగాణ-తాద్వాయి

నర్సరీలో మొక్కలు ఎండిపోతే చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో సయ్యద్ సాజిద్ అలీ అన్నారు. గురువారం మండలంలోని కృష్ణాజివాడి నర్సరీని పరిశీలించి మాట్లాడారు. నర్సరీలో పిచ్చి మొక్కలు ఉంటే ఉపాధిహామీ సిబ్బందితో కలుపు నివారణ చేయించాలని ఆదేశించారు. అవసరమైన నీటి తడులు అందించాలని అన్నారు. నీటి తెరలు సరిచేసి అమర్చినట్లయితే మొక్కలు వాలిపోకుండా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సిబ్బంది తదితరులున్నారు.

విగ్రహ ప్రతిష్టాపన

- అఖండ హరినామ సప్తహా


మాట్లాడుతున్న ప్రభుత్వ సలహాదారులు పోచారం శ్రీనివాస్‌రెడ్డి

నవతెలంగాణ-పోతంగల్

మండలంలోని దోమలెడ్గి గ్రామంలో 8వ అఖండ హరినామ సప్తహా, శ్రీ రుక్మిణీ పాండురంగ విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ నియోజకవర్గ శాసనసభ్యులు పోచారం శ్రీనివాస్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. పోతంగల్ మండల ప్రజాప్రతినిధులు, నాయకులు, పాండురంగా స్వామి భక్తులు తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష అట్టలు పంపిణీ

నవతెలంగాణ-పిట్లం

మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాల పదవ తరగతి విద్యార్థినీలకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పెన్నులు, పరీక్ష అట్టలను అందజేశారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ జోన్ చైర్మన్ కిషన్ మాట్లాడుతూ.. పదవ తరగతి పూర్తి చేస్తున్న విద్యార్థిలు రాబోయే వార్షిక పరీక్షలను రాసేందుకుగానూ తమ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పెన్నులు , పరీక్ష ప్యాడ్‌లను తమ వంతు సహకారంగా అందజేసినట్టు వివరించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ చైర్మన్ కాశిరెడ్డి, కార్యదర్శి వేణుగోపాల్, కోశాధికారి బాలు, సభ్యులు ప్రమోద్ పాటిల్, లక్ష్మీనారాయణ, రాజుసేట్, సంతోష్, బెజుగం చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు వజ్రోత్సవాలు

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని కల్వరాల్ గ్రామంలో శుక్రవారం వజ్రోత్సవాలు నిర్వహిస్తున్నట్టు ప్రధానోపాధ్యాయులు విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. ఈ పాఠశాలలో 1965 నుంచి 2025 వరకు చదివిన ప్రతి ఒక్కరూ వజ్రోత్సవాల్లో పాల్గొని విజయవంతం చేయాలని అన్నారు. ఈ పాఠశాలలో చదివిన పరిసర గ్రామాలైన పద్మాజివాడి, తుక్కోజివాడి, తిమ్మోజివాడి, దగ్గి తదితర గ్రామాల నుంచి ఈ పాఠశాలలో విద్యను అభ్యసించారని అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని అన్నారు. వీడిసి అధ్యక్షులు కుంట రాజిరెడ్డి, కుంట గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కోటలో మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్‌కు అవకాశం కల్పించాలి

నవతెలంగాణ-సదాశివనగర్

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడైన మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్‌కు ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలని కామారెడ్డి జిల్లా గిరిజన నాయకులు సురేందర్ రాథోడ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధిష్టానం లంబాడి సామాజిక వర్గానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు స్వరాష్ట్రం కోసం అహర్నిశలు కృషి చేసిన రాములు నాయక్‌కు ఎమ్మెల్సీ పదవి ఇచ్చి గిరిజనుల అభివృద్ధికి సహకరించాలని అన్నారు.

మరుగుదొడ్ల నిర్మాణానికి భూమిపూజ

నవతెలంగాణ-రెంజల్

మండల కేంద్రమైన రెంజల్ జిల్లా పరిషత్ పాఠశాల, ప్రాథమిక పాఠశాలలో మరుగుదొడ్లకు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఎం.నాగభూషణంరెడ్డి, అసెంబ్లీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కార్తిక్ యాదవ్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో నిరుపేద విద్యార్థులకు మౌలిక సదుపాయాలను అందజేయాలన్న సంకల్పంతో బోధన్ ఎమ్మెల్యే పి.సుదర్శన్‌రెడ్డి నిధులు మంజూరు చేయించారని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ అధ్యక్షులు సగ్గు వెంకటి, డైరెక్టర్ కురుమే శ్రీనివాస్, సీనియర్ నాయకులు సాయిబాబా గౌడ్, కాంగ్రెస్ మహిళా మండల అధ్యక్షురాలు ఇందిరా దేవి, బి.రవి, గైని కిరణ్, ఎ.శ్రీకాంత్, శివకుమార్, గైని సాయిలు, సమ్మి శరత్, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత దంత వైద్య శిబిరం

నవతెలంగాణ-కామారెడ్డి

ఇండియన్ డెంటల్ అసోసియేషన్ కామారెడ్డి శాఖ ఆధ్వర్యంలో డెంటిస్ట్ డే ను పురస్కరించుకొని గురువారం జిల్లా కేంద్రంలోని ఓరియంటల్ పాఠశాలలో దంత డాక్టర్ల బృందం ఆధ్వర్యంలో పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు దంతాల పరీక్షలు నిర్వహించారు. వైద్య పరీక్షల అనంతరం ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ దంత వైద్య శిబిరంలో డాక్టర్ నిమ్మ అభిషేక్ రెడ్డి, డాక్టర్ కవిత, డాక్టర్ యండి సాజిద్, డాక్టర్ యండి సారా, డాక్టర్ నిమ్మ క్రాంతి, డాక్టర్ నాగరాజ్ యెల్లా, డాక్టర్ శ్రావణ్, డాక్టర్ రాకేష్, డాక్టర్ ప్రవీణ్ కుమార్, డాక్టర్ మౌనిక, పాఠశాల ప్రిన్సిపాల్ మురళి రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు గెరిగంటి లక్ష్మినారాయణ, పాఠశాల టీచర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ అరవింద్, బిజెపి జిల్లా అధ్యక్షులు దినేష్ కులచారి దిష్టిబొమ్మలు దహనం


దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-రెంజల్

మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే పి.సుదర్శన్‌రెడ్డిపై పార్లమెంటు సభ్యులు ధర్మపురి అరవింద్, బిజెపి నాయకులు అనుచిత వ్యాఖ్యలు చేయడం సరైన కాదని రెంజల్ కాంగ్రెస్ పార్టీ నాయకుల అన్నారు. గురువారం ఇరువురి దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడారు. ఆయన రాజకీయ జీవితమంతా వయసు లేని అరవింద్ ఆయనపై అనుచిత వ్యాఖ్యలు చేయడం చిల్లర రాజకీయాలు చేయడం వారికే దక్కుతుందన్నారు. పెద్దలు సుదర్శన్‌రెడ్డి తెలంగాణలోని మచ్చలేని ఏకైక నాయకుడు అని తెలిపారు. ఆయనపై లేనిపోని ఆరోపణలు చేయడం సరైనది కాదన్నారు. రైతులు, బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం నిరంతరం సేవ చేస్తున్న ఆయనపై వ్యక్తిగత విమర్శలు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. మరోసారి ఆయనపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే తాము సహించేది లేదని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షులు జి.సాయిరెడ్డి, సీనియర్ నాయకులు సాయిబాబాగౌడ్, ధనుంజయ్, ఎమ్మెల్.రాజు, ఓ మోహన్, తాడ్‌బిలోని మాజీ సర్పంచ్ జంగం గంగాధర్, వై.శంకర్, బి.రవి, గుజ్జ భూమయ్య, యువజన నాయకులు కార్తీక్ యాదవ్, గైని కిరణ్, అపోలో శ్రీకాంత్, శంషొద్దీన్, కృష్ణ, సిద్ధ సాయిలు, గైని సాయిలు తదితరులు పాల్గొన్నారు.

56వ సారి రక్తదానం


56వ సారి రక్తదానం చేస్తున్న శ్రీకాంత్‌రెడ్డి

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని అడ్లూరు ఎల్లారెడ్డి గ్రామానికి చెందిన మోసార్ల శ్రీకాంత్ రెడ్డి గురువారం కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో 56వ సారి రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో రక్త నిల్వలు పడిపోవడంతో ఆయనను సంప్రదించగా రక్తదానం చేసినట్లు శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. ప్రతి ఒక్కరూ సేవా కార్యక్రమంలో భాగంగా రక్తదానం చేయాలని ఆయన సూచించారు.

ఉపాధి హామీ పనులు పరిశీలన


మాట్లాడుతున్న ఎంపీడీవో నరేష్

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని నల్లమడుగు గ్రామ సమీపంలో జాతీయ గ్రామీణ ఉపాధి పనులను ఎంపీడీవో నరేష్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ముందుగా కూలీల మాస్టర్ రూల్స్ పరిశీలించి హాజరు శాతాన్ని అడిగి తెలుసుకున్నారు. పని ప్రదేశాల్లో కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి కూలీకి పని కల్పించాలని తెలిపారు. కూలీల సంఖ్యను పెంచాలన్నారు. కూలీలు పని ప్రదేశాలకు ఉదయమే చేరుకోవాలన్నారు. ఆయన వెంట ఎంపీఓ మలహరి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు

- కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు డిమాండ్

నవతెలంగాణ-ఎడపల్లి


దిష్టబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి పట్ల ఎంపీ అరవింద్ తన హెూదా మరచి అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదని గురువారం బోధన్ నిజామాబాద్ రహదారిపై ఎడపల్లి మండల కేంద్రంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఎంపీ అరవింద్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు పులి శ్రీనివాస్ మాట్లాడుతూ.. తన తండ్రి లాంటి వయసున్న ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డిని వ్యక్తిగతంగా దూషించడం తగదన్నారు. బోధన్ అసెంబ్లీ నియోజకవర్గం కూడా పార్లమెంటు పరిధిలో ఉన్న విషయం గమనించాలన్నారు. జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఇలాంటి లింగం మాట్లాడుతూ... తన పార్లమెంట్ పరిధిలో ఎంపీ అరవింద్ ఎక్కడ పర్యటించారో తెలపాలన్నారు. పార్లమెంట్ సభ్యునిగా బోధన్ నియోజకవర్గానికి ఎన్ని నిధులు కేటాయించారో తెలపాలన్నారు. కేవలం తన వ్యక్తిగత ప్రాబల్యం కోసం పాకులాడటం తగదన్నారు. కాంగ్రెస్ మాజీ మండలాధ్యక్షుడు ఎల్లయ్య యాదవ్ మాట్లాడుతూ.. ఎంపీ అరవింద్ అభివృద్ధిని పక్కనపెట్టి జిల్లా రాజకీయాలలో తనకంటూ ప్రత్యేక ముద్ర వేసుకున్న ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డిని వ్యక్తిగతంగా దూషించడం తగదు అన్నారు. కార్యక్రమంలో నాయకులు నారాయణ చౌదరి, నీరడి రవికుమార్, బొబ్బిలి శ్రీనివాస్, కిషోర్, నవీన్, రాజ్ కుమార్, ప్రసాద్, సంజీవ్, ఎజాజ్, తాహెర్ తదితరులు ఉన్నారు.

అంతర్జాతీయ మహిళా పోరాట దినం పోస్టర్ల ఆవిష్కరణ

నవతెలంగాణ-బోధన్


అంతర్జాతీయ మహిళా పోరాట దినం పోస్టర్లను ఆవిష్కరిస్తున్న పిఓడబ్ల్యు మహిళ నాయకులు

మహిళలపై జరుగుతున్న దాడులకు, పరువు హత్యలకు, అత్యాచారాలకు వ్యతిరేకంగా పోరాడుదామంటూ అంతర్జాతీయ మహిళా పోరాట దినం సందర్భంగా మార్చి ఒకటో తారీఖు నుంచి ఎనిమిదవ తేదీ వరకు సభలు, ప్రదర్శనలు నిర్వహించాలని కోరుతూ గురువారం పిఓడబ్ల్యు ఆధ్వర్యంలో బోధన్ పట్టణంలో పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బి.నాగమణి మాట్లాడుతూ.. అంతర్జాతీయ మహిళా పోరాట దినం ఆవిర్భవించి నేటికి 144 సంవత్సరాలు అయ్యిందని, పనిగంటల తగ్గింపు కోసం, పనిస్థలాల్లో కనీస వసతుల కోసం, మెరుగైన వేతనాలు కావాలని, ఓటు హక్కు కోసం 1850 దశకం తర్వాత కాలంలో మహిళలు పోరాటాల బాట పట్టారని దీనిలో భాగంగా న్యూయార్క్ నగరంలో కుట్టు పని చేసే వేలాది మంది మహిళలు ఉద్యమించారని, కానీ ఈ ఉద్యమాన్ని యజమాన్యాలు నాటి పాలకులు నిరంకుశంగా అణిచివేశారని అన్నారు. ఆనాడు ఎంతోమంది మహిళలు వీర మరణం పొందారని తెలిపారు. మహిళలు తమ రక్తాన్ని చిందించి హక్కులు సాధించుకున్న రోజును అంతర్జాతీయ మహిళా పోరాట దినంగా జరపాలని జర్మన్ కమ్యూనిస్టు పార్టీ నాయకురాలు క్లారాజెట్కిన్ 1910 సంవత్సరంలో కోపెన్ హెగన్‌లో జరిగిన రెండవ ఇంటర్నేషనల్ మహాసభలో ప్రతిపాదించగా ఆమోదించారని తెలిపారు. నాటి నుండి నేటి వరకు మహిళలపై జరుగుతున్న అణిచివేత, వివక్షతకూ, అసమానత్వానికి వ్యతిరేకంగా మార్చి ఒకటి నుంచి 8 వరకు ప్రదర్శనలు - సభలు జరపాలని కోరారు. ఈ కార్యక్రమంలో రెహానా బేగం, ఆర్.లక్ష్మి, కే.పద్మ, బి.యాదమ్మ, ఎస్.పోశవ్వ, అరుగొండ లత, బి.సుజాత, కమల, బేతి నాగమణి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో విజయ స్ఫూర్తి

నవతెలంగాణ-లింగంపేట్


విజయ స్ఫూర్తిలో పాల్గొన్న విద్యార్థులు

హెల్పింగ్ బ్రిడ్జ్ ఫర్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, బాలికల ఉన్నత పాఠశాల లింగంపేట్‌లో విజయ స్ఫూర్తి కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి హెల్పింగ్ ఎడ్యుకేషన్ ప్రతినిధులు రజనీకాంత్‌గౌడ్, కృష్ణకర్, సత్యనారా యణ రెడ్డి మాట్లాడుతూ.. కెరీర్ గైడెన్స్‌లో భాగంగా పదవ తరగతి తర్వాత గల విద్యా ఉద్యోగ అవకాశాల గురించి వివరిస్తూ విద్యార్థులందరూ చాలా బాగా చదివి ఉన్నత స్థితికి చేరుకోవాలని తెలియజేశారు. మండల విద్యాధికారి షౌకత్ అలీ మాట్లాడుతూ.. కార్యక్రమానికి సహకరించిన హెల్పింగ్ బ్రిడ్జి ఫర్ ఎడ్యుకేషన్ ద్వారా విద్యార్థులందరికీ పరీక్షా కిట్లను అందజేసిన రాజారాం నాగరాజును అభినం దించారు. పాఠశాల ఉపాధ్యాయులు వహీద్ సిద్ధికి మాట్లాడుతూ గత ఎనిమిది సంవత్సరాలుగా విద్యార్థులకు సేవలు అందిస్తున్న హెల్పింగ్ బ్రిడ్జి ఫర్ ఎడ్యుకేషన్ సంస్థను కొనియాడారు. లింగంపేట్ గ్రామస్తులు రాజారాం నాగరాజు మాట్లాడుతూ.. విద్యార్థులందరూ కష్టపడి ఇష్టంతో చదివి తల్లిదండ్రులకు ఉపాధ్యాయులకు పేరు తీసుకురావాలని తెలియజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు అపర్ణ గంగాధర్, సూర్య తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అత్యవసర పరిస్థితిలో రక్తం అందజేత

నవతెలంగాణ-కామారెడ్డి

జిల్లా కేంద్రంలోని ప్రైవేటు ఆస్పత్రిలో కావ్య(28) గర్భస్రావం కావడంతో అత్యవసరంగా రక్తం అవసరమని డాక్టర్లు సూచించారు. కుటుంబ సభ్యులు ఐవిఎఫ్ సేవా రాష్ట్ర చైర్మన్, రెడ్‌క్రాస్ జిల్లా సమన్వయకర్త డాక్టర్ బాలును సంప్రదించారు. వారికి కావలసిన రక్తాన్ని రాజంపేట రెడ్‌క్రాస్ వైస్ చైర్మన్ ప్రసాద్ సహకారంతో అందించినట్టు బాలు తెలిపారు. డాక్టర్ బాలు, రక్తదా తల సమూహ అధ్యక్షులు జమీల్ హైమద్‌లు మాట్లాడుతూ.. మానవత్వంతో ముందుకు వచ్చి సకా లంలో రక్తాన్ని అందజేసినప్పుడే ప్రాణాలను కాపాడగలుగుతామన్నారు. రక్తదాత ప్రసాద్‌కు జిల్లా రెడ్‌క్రాస్ పక్షాన, ఐవిఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా తరపున అభినందనలు తెలిపారు.

ఉచిత హెల్త్ క్యాంప్ ఏర్పాటు

నవతెలంగాణ-జుక్కల్

మండలంలోని దోస్పల్లి గ్రామంలో ఆర్ఎంపి వైద్యులు సుధాకర్ ఆధ్వర్యంలో శ్రీ నరేంద్ర మహారాజ్ ఆశీస్సులతో ఉచిత హెల్త్ క్యాంప్ ఏర్పాటు చేసినట్టు ఆర్ఎంపీ డాక్టర్ గురువారం తెలిపారు. పలు గ్రామాల నుంచి భారీగా రోగులు తరలిరావడంతో క్యాంపు కార్యాలయం రోగులతో నిండిపోయింది. రోగులకు రక్తహీనత, బిపి, షుగర్, గుండెకు సంబంధించిన పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులను పంపిణీ చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో నరేంద్ర మహారాజ్ భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు ఎండిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

- ఎంపీడీవో రాజ్ కిరణ్ రెడ్డి


నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీవో

నవతెలంగాణ-భిక్కనూర్

మొక్కలు ఎండిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీవో రాజ్‌కిరణ్ రెడ్డి బస్వాపూర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి దయాకర్‌రెడ్డికి సూచించారు. గ్రామంలో ఉన్న నర్సరీలోని మొక్కలను గురువారం పరిశీలించారు. అనంతరం ఉపాధి హామీ పనులు, హాజరుశాతం, వివరాలు పరిశీలించారు. గ్రామంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఉపాధి హామీ పని కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, తదితరులున్నారు.

ప్రజల సమస్యల పరిష్కారంలో కార్యదర్శులు

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని ఇసన్నపల్లి, సిద్ధరామేశ్వరనగర్, పెద్దమల్లారెడ్డి, కంచర్ల, అంతంపల్లి, రామేశ్వర్‌పల్లి ఆయా గ్రామాలలో పంచాయతీ కార్యదర్శులు ప్రజల సమస్యల పరిష్కారంలో నిమగ్నమయ్యారు. సిద్ధ రామేశ్వరనగర్ గ్రామంలో పంచాయతీ కార్యదర్శి అఖిల నీటి సమస్య పరిష్కారం కొరకు చెడిపోయిన పైప్‌లైన్, బోరుమోటర్‌ను బాగు చేయించారు. అంతంపల్లి, ఈసన్నపల్లి గ్రామాలలోని కార్యదర్శులు భార్గవి, ప్రశాంత్ నర్సరీలోని మొక్కలు ఎండిపోకుండా ట్యాంకర్ల ద్వారా నీరు పోశారు. గ్రామ సమస్యలను పంచాయతీ కార్యదర్శులకు తెలియజేయాలని గ్రామస్తులకు సూచించారు.

భవనం ఉన్నా.. కరెంటు లేదు

- కరెంట్ లేక చిన్న పిల్లల అవస్థలు



నవతెలంగాణ-నిజాంసాగర్

మండలంలోని ఆరేడ్ గ్రామంలోని అంగన్వాడి భవనానికి కరెంటు లేక చిన్న పిల్లలు తీవ్ర అవస్థలు పడుతున్నారని పిల్లల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. అంగన్వాడి పరిశీలనకు వచ్చిన మండల పరిషత్ అభివృద్ధి అధికారి గంగాధర్‌కు ఇట్టి విషయంపై స్కూల్ టీచర్ ప్రమీల తెలపగా ఆయన పంచాయతీ కార్యదర్శికి వెంటనే కరెంటు ఏర్పాటు చేయాలని ఆదేశించిన ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపించారు. భవనం లోపల కిటికీలు తెరిచి పాఠశాల కొనసాగించిన స్కూల్ ఊరు చివరలో ఉన్నందున కిటికీల నుంచి ఎలుకలు వచ్చి బాలామృతం, గుడ్లను నాశనం చేస్తున్నాయని స్కూల్ టీచర్ తెలిపారు. వచ్చే వేసవికాలం విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా ఉండాలంటే వెంటనే అధికారులు స్పందించి భవనానికి కరెంట్ సరఫరాను ఏర్పాటు చేయాలని వారు కోరారు.

ఏరియా ఆసుపత్రికి వైద్య పరికరాల అందజేత



నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని ఏరియా ఆసుపత్రిలో సేవ్ లైవ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెర్సిడిస్ బెంజ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సహకారంతో 15 లక్షల విలువగల వైద్య పరికరాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరిండెంట్ రవికుమార్, వైద్యులు రామ్‌రెడ్డి, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల భూమిని కాపాడండి

- కబ్జాకు పాల్పడుతున్న కాంగ్రెస్, బిజెపి పార్టీ నాయకులు
- ప్రజావాణిలో కలెక్టర్‌కు, రూరల్ ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేసిన పాఠశాల పూర్వ విద్యార్థులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ నగర శివారులోని బోర్గం (పాంగ్రా) జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన భూమిని కాంగ్రెస్, బిజెపి పార్టీలకు చెందిన నాయకులు కబ్జాకు పాల్పడుతున్నారని పూర్వ విద్యార్థులు సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. నిజామాబాద్ జిల్లా కేంద్రానికి సమీప దూరంలో గల బోర్గం (పాంగ్రా) జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు సంబంధించిన సర్వే నంబర్ 586/1/2లో ఎకరం 21 గుంటల భూమిని విద్యార్థులకు ఆటస్థలం కేటాయించేందుకు ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఈ స్థలాన్ని కబ్జా చేసేందుకు కాంగ్రెస్, బీజేపీ నాయకులు ప్రయత్నిస్తున్నారన్నారు. దీనిపై పాఠశాల పూర్వ విద్యార్థులు రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డితో పాటు ప్రజావాణిలో జిల్లా కలెక్టర్ కు పిర్యాదు చేశారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ రెవెన్యూ డివిజనల్ అధికారిని విచారణ చేపట్టవలసిందిగా ఆదేశాలు జారీ చేసినట్లు పూర్వ విద్యార్థులు తెలిపారు. నిజామాబాద్ జిల్లాలో బోర్గాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్కూల్ విద్యార్థులకు ఆడేందుకు ఆట స్థలం లేకపోవడంతో స్థానిక ప్రజలు, స్థానికులు, గ్రామస్తులు కలిసి గత ప్రభుత్వంలో ఎమ్మెల్యేగా పనిచేసిన బాజిరెడ్డికి మొరపెట్టుకున్నారు.

దానితో స్థానికంగా జిల్లా పరిషత్ పాఠశాలను ఆనుకుని ఉన్న 586 సర్వే నంబర్‌లో ప్రభుత్వ శిఖం భూమి 2.38 ఎకరాలు ఉండగా దానిని పాఠశాల క్రీడా స్థలానికి కేటాయించాలని ఆదేశించారు. అప్పటి వరకు అక్కడ భూమి పడావుగా ఉండగా చుట్టు పక్కల సాగు చేస్తున్న రైతులు కబ్జా చేసేందుకు యత్నించడంతో అక్కడ ప్రభుత్వ స్థలం అని బోర్డు పెట్టారు. దాదాపు దశాబ్దకాలంగా అక్కడ సర్కారు స్థలం అని మోపాల్ తహసీల్దార్ బోర్డు ఏర్పాటు చేశారు. కానీ ఇప్పుడు అక్కడ భూముల విలువ కోట్లకు పడగలెత్తింది. ఈ భూములపై కబ్జాదారులు కన్ను ఈ శిఖం భూమిపై పడటంతో అభూమికి రెక్కలొచ్చాయి. బోర్గాంలో సర్వే నంబర్ 586లో ఉన్న సర్కారు శిఖం భూమికి పట్టా వచ్చింది. అక్కడ రైతులకు ఎకరం ఉండగా మిగిలిన ప్రభుత్వ భూమి కలుపుకుని పట్టాలను రెవెన్యూ శాఖ ఇచ్చినట్లు తెలిసింది.

అసలు 1954 నుంచి 2016 వరకు అది ప్రభుత్వ శిఖం భూమి అని ఉన్న స్థలంకు ఇరిగేషన్ శాఖ ఎలా ఎన్ఎసి ఇచ్చిందనేది విద్యార్థులకు గ్రామస్తులకు ఓ ప్రశ్నగా మిగిలింది. అంతే కాకుండా గతంలో పనిచేసిన జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఎన్ఎసి భూముల వ్యవహారంలో కూడా ఫిర్యాదులు అందిన పట్టించుకోలేదని ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. పట్టించుకోవడమే కాకుండా వారి హయాంలోనే అక్కడ పట్టా కోసం పంచాయతీ యంత్రాంగం వద్ద పట్టాలెక్కినట్లు ఆరోపిస్తున్నారు. జిల్లాలో మంచి పేరు పొందిన రెవిన్యూ సంఘం నేత ఒక్కరు అంతా దగ్గర ఉండి శిఖం భూమికి పట్టా లు ఇప్పించారని సమాచారం. ఇదిలా ఉండగా పట్టాలు రాగానే రెవిన్యూ అధికారులు రికార్డులు పరిశీలించకుండానే నాలా కన్వర్షన్ ఇచ్చారా లేక ఇప్పుడు అక్కడ జరుగుతున్న నిర్మాణ పనులకు బల్దియా అధికారులు అనుమతులు ఇస్తున్నారనే ఆరోపణలు అధికారులపై వస్తున్నాయి. ఎమ్మెల్యే పేద విద్యార్థులు చదివే స్కూల్ కోసం క్రీడా స్థలం కు సర్కారు భూమిని కేటాయించాలని సిఫారసు చేస్తే ఆగిన కబ్జాలు ప్రభుత్వం మారగానే పట్టా ఎలా వచ్చాయని చర్చ పెద్ద ఎత్తున జరుగుతున్న సంబంధిత శాఖ అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నట్లు తెలుస్తుంది. ఎందుకంటే ప్రస్తుతం బోర్గాం (పి) గ్రామం నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ లో విలీనం అయింది.



మాట్లాడుతున్న పూర్వ విద్యార్థులు (ఫైల్)

నగరంలో ప్రజలు ఇతర అవసరాలకు ఉపయోగపడాల్సిన ప్రభుత్వ భూమిని ప్రైవేట్ వ్యక్తులకు ఎలా పట్టా చేశారని ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కోట్ల విలువ చేసే 2.38 ఎకరాల భూమి ప్రభుత్వం మారగానే ఎక్కడ మాయం అయిందని, దానికి పట్టా ఎలా ఇచ్చారని చర్చ జరుగుతుండగానే నాలా కన్వర్షన్ రావడం అక్కడ కబ్జాదారులు ప్రైవేట్ వెంచర్ ఏర్పాటుకు చకా చక పనులు జరుగుతుంటే అనుమానాలు ఇంకా బలపడుతున్నాయి. నిజామాబాద్ నగర శివారులోని బోర్గం(పి) గ్రామంలో కాంగ్రెస్ నేత కబ్జా చేసిన ప్రభుత్వ భూమిపై ఇంటెలిజెన్స్ విచారణ చేపట్టినట్లు సమాచారం. అయితే ఈ విచారణలో ఈ విషయాలు బయట పడతాయో వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది.

వర్ధంతి సభ పోస్టర్ల ఆవిష్కరణ

- 9న కామ్రేడ్ సుభాష్ చంద్రబోస్ వర్ధంతి



పోస్టర్లను ఆవిష్కరించిన నాయకులు

నవతెలంగాణ-ధర్పల్లి

సిపిఐ(ఎంఎల్) ప్రజాపంథా సిద్ధాంతకర్త కామ్రేడ్ రాయల సుభాష్ చంద్రబోస్ తొమ్మిదవ వర్ధంతి సభ పోస్టర్లను మండల కేంద్రంలో సిపిఐ (ఎంఎల్) మాస్‌లైన్ గోడ పోస్టర్స్ ఆవిష్కరణ గురువారం చేశారు. ఈ సందర్భంగా సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్ (ప్రజాపంథా)ఆర్మూర్ డివిజన్ సహాయ కార్యదర్శి ఆర్.రమేష్ మాట్లాడుతూ.. భారత విప్లవ ఉద్యమంలో 50 సంవత్సరాలు అజ్ఞాత జీవితం గడిపి అనేక ప్రజా ఉద్యమాలను నిర్మించిన ఘనత కామ్రేడ్ రాయల సుభాష్ చంద్రబోస్ (రవన్న)కు ఉందన్నారు. కామ్రేడ్ రవన్న తొమ్మిదవ వర్ధంతి సభను ఖమ్మం రామ నర్సయ్య విజ్ఞాన కేంద్రంలో మార్చ్ 9న నిర్వహించనున్నట్టు తెలిపారు. 8న పిండిప్రోలు గ్రామంలో రాయల నాగేశ్వరావు విగ్రహావిష్కరణ సభను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్ మండల నాయకులు ఆశన్న, రాంచందర్, పీలాష్, పోషన్న కృష్ణ, గంగాధర్, సుమన్, సాయవ్వ, రామాడ్గు సాయవ్వ, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులతో రైతులకు మేలు

- మహిళా సమైక్యాల ద్వారా సేంద్రియ ఎరువుల విక్రయం
- ఐకెపి వ్యవసాయ విభాగం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ మారుతి

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

సేంద్రియ ఎరువులను వినియోగించడం ద్వారా భూసారం కాపాడడంతోపాటు రైతులకు ఎన్నో రకాల మేలు చేకూరుస్తుందని ఐకెపి వ్యవసాయ విభాగం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ మారుతి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఐకెపి మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రసాయనిక ఎరువులను వాడడం వల్ల ప్రతి ఏటా భూసారం తగ్గిపోతోందని అన్నారు. భూసారాన్ని పరిరక్షించుకోవాలంటే కృత్రిమ రసాయన ఎరువుల వాడకాన్ని దశలవారీగా పూర్తిగా తగ్గించాలని హితవు పలికారు. సాంప్రదాయ సేంద్రీయ ఎరువులను వాడితే భూసారాన్ని కాపాడుకోవడంతోపాటు పంట దిగుబడి సైతం ఊహించని రీతిలో పెరుగుతుందన్నారు. సేంద్రియ ఎరువుల వాడకంతో పండించిన పంట ఉత్పత్తులను భుజించడం వల్ల ఆరోగ్యాలు కూడా మెరుగుపడతాయని, తద్వారా ఆసుపత్రి ఖర్చులు గణనీయంగా తగ్గుతాయన్నారు. ప్రస్తుతం ప్రతి ఒక్క పౌరుడు ఏదో ఒక ఆరోగ్య సమస్యతో బాధపడుతున్నారని, ఇందుకు రసాయన ఎరువులతో కూడిన పంట ఉత్పత్తులను తినడం వల్లనే ఈ అనారోగ్యాలు వస్తున్నాయని పేర్కొన్నారు. సేంద్రియ ఎరువులను పూర్తిగా పశువుల పేడ, చెరువులలో లభించే నల్ల మట్టి, నట్టలతో తయారుచేసిన కంపోస్టు ఎరువులతో కలిపి రూపొందించడం జరుగుతుందన్నారు.

మహిళా సమాఖ్యల ద్వారా సేంద్రియ ఎరువుల విక్రయం..

మహిళా సమాఖ్యల ద్వారా సేంద్రియ ఎరువుల విక్రయం జరుగుతుందని ఐకెపి వ్యవసాయ విభాగం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ మారుతి తెలిపారు. జిల్లాలో మహిళా రైతులతో రైతు ఉత్పత్తిదారుల సంఘాలను ఏర్పాటు చేశామని తెలిపారు. బాల్కొండ మహిళా రైతు ఉత్పత్తిదారుల సమాఖ్య ఆధ్వర్యంలో సేంద్రియ ఎరువులను ఉత్పత్తి చేసి, ఔత్సాహిక రైతులకు నేరుగా గ్రామానికి సేంద్రీయ ఎరువులను డెలివరీ ఇచ్చేలా ఏర్పాటు చేశామని వెల్లడించారు.ఐకెపి సిబ్బంది వివోఏలు, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు గ్రామాల్లో మహిళ రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు.

స్త్రీనిధి, బ్యాంకు రుణాల రికవరీ 100 శాతం సాధించాలి..

2024-25 ఆర్థిక సంవత్సరం ఈ నెలతో ముగుస్తున్నందున జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో స్త్రీనిధి, బ్యాంకు లింకేజీ రుణాల బకాయిల రికవరీ కోసం స్పెషల్ డ్రైవ్ లు నిర్వహించడం జరుగుతుందని ఐకెపి ఏపీఎం కుంట గంగాధర్ వెల్లడించారు. మరో ఐదు రోజుల్లో అన్ని రుణాల రికవరీ 100 శాతం సాధించేందుకు సీసీలు,



మాట్లాడుతున్న ఐకెపి వ్యవసాయ విభాగం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ మారుతి

వివోఏలు, మహిళా సమాఖ్య సీనియర్ ఓబిలతో కలిసి కృషి చేయాలన్నారు. మండలంలో రికవరీ 97 శాతం ఉందని దీనిని 100 శాతం చేయడానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఫాం ఏపీయం రవి కుమార్, బాల్కొండ మహిళ ఉత్పత్తిదారుల సమాఖ్య చైర్మన్ గంగాలక్ష్మి, డైరెక్టర్ చౌట్ పల్లి గంగమ్మ, సీసీలు భలే రావు రవికుమార్, నవీన్ కుమార్, భాగ్యలక్ష్మి, పీరియ, అలేఖ్య స్త్రీనిధి సహాయ మేనేజర్ రేణుక, ఆపరేటర్ అనసూయ, వివోఏలు పాల్గొన్నారు.

స్కానింగ్ సెంటర్లలో స్పెషల్ టాస్క్ ఫోర్స్ తనిఖీలు

నవతెలంగాణకంఠేశ్వర్

పిసిపిఎన్‌డిటి టాస్క్ ఫోర్స్ బృందం ప్రత్యేక తనిఖీల్లో భాగంగా నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని మెడికవర్, మనోరమ ఆసుపత్రులను ఆరుగురు సభ్యులతో కూడిన బృందం తనిఖీ చేసినట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి. రాజశ్రీ గురువారం తెలిపారు. జిల్లా రిజిస్ట్రేషన్ అథారిటీ డిఎంహెచ్ఓ వద్ద నమోదు చేయించుకున్న స్కానింగ్ మిషన్లను రిజిస్టర్ అయిన డాక్టర్స్ మాత్రమే స్కానింగ్ చేయాలన్నారు. ఒకవేళ ఏదైనా మార్పులు స్కానింగ్ మిషన్లలో కానీ , డాక్టర్ లలో కానీ ఉంటే అనుమతి లేకుండా స్కానింగ్ చేయొద్దని తెలిపారు.

అదేవిధంగా డాక్టర్ రిఫరల్ స్లిప్ ఇచ్చిన తర్వాతనే స్కానింగ్ చేయాలనానరు. ఫామ్ ఎఫ్ లో గర్భిణీ స్త్రీ అనుమతి, వైద్యుని సంతకం, గర్భిణీ స్త్రీ గుర్తింపు కార్డు ఉండాలని, స్కానింగ్ రిపోర్టును జత పరచాలని తెలిపారు. ప్రతి స్కానింగ్ కేంద్రంలో ప్రతిరోజు స్కానింగ్ రిపోర్ట్స్‌ను ఫార్మ్‌ను ఆన్లైన్లో ఎంట్రీ చేస్తూ ప్రతినెల రిపోర్ట్స్ ను సబ్మిట్ చేయాలన్నారు. రికార్డ్స్ ను మెయింటైన్ చేస్తూ రెండు సంవత్సరాల వరకు భద్రపరచాలని తెలిపారు. ఈ స్పెషల్ టాస్క్ ఫోర్స్ కమిటీలో ఆరుగురు సభ్యులు ప్రోగ్రాం ఆఫీసర్ ఎంసి హెచ్/డిప్యూటీ డిఎంహెచ్ఓ, గైనకాలజిస్ట్, మహిళా తహసిల్దార్, మహిళా పోలీస్ ఆఫీసర్, సఖి కన్సల్టెంట్ ఉన్నారు. డాటా ఎంట్రీ ఆపరేటర్ఈ ఆరుగురు సభ్యుల బృందం జిల్లా కేంద్రంలోని మెడికవర్ మనోమ ఆసుపత్రులను తనిఖీ చేస్తున్న సమయంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని డాక్టర్ బి రాజశ్రీ పర్యవేక్షించినట్లు తెలియజేశారు. ఈ తనిఖీ బృందం జిల్లా వ్యాప్తంగా ఉన్న స్కానింగ్ సెంటర్ లను ఆకస్మికంగా ఎప్పుడైనా తనిఖీ చేస్తారని తెలిపారు.

దొంగలు దొరికేనా?
సొమ్ము రికవరీ అయ్యేనా?

నవతెలంగాణ-తాడ్వాయి

మండల కేంద్రంతో పాటు బ్రాహ్మణపల్లిలో గత నాలుగు రోజుల క్రితం దోపిడీకి పాల్పడ్డ దొంగలు దొరికేనా.. అపహ రించుకు పోయిన సొమ్ము దొరికేనా అంటూ గ్రామంలో గుసగుసలు వినిపిస్తున్నాయి. ప్రజలకు ఎల్లవేళలా రక్షణ కల్పించాలని ఉద్దేశంతో రాత్రింబవళ్లుపోలీసులు విధులు నిర్వహిస్తున్నప్పటికీ దోపిడీలు జరగడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. మండల కేంద్రానికి చెందిన శరత్ ఇంటి తాళాలు పగలగొట్టి నాలుగు తులాల 30 గ్రాముల బంగారం, పది తులాల వెండి పట్టే గొలుసులు, 5000 నగదు, గడ్డల సరోజర ఇంట్లో మూడు మాసాల మాటీలు, రెండు మాసాల ఉంగరం, పది తులాల పట్టే గొలుసులు, 18000 వేల నగదుదోపిడి కాక బ్రాహ్మణపల్లికి చెందిన సెట్కూరి తిరుపతి ఇంట్లో మూడు లక్షల రూపాయల దోపిడీ జరిగిందని తెలిసిందే. దోపిడీకి పాల్పడ్డ దొంగలను అపరించుకు పోయిన నగదు సొమ్ము పోలీసులు ఎప్పుడు చేదిస్తారో వేచి చూడాల్సిందే.

ఒంటరి మహిళల సంక్షేమం కోసం..
కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చట్టం చేయాలి

- బహుజన లెఫ్ట్ మహిళా సంఘం రాష్ట్ర కన్వీనర్ సబ్బని లత

నవతెలంగాణ-కంఠేశ్వర్

దేశంలోని ప్రతి గ్రామంలో 200 నుండి 300 మంది ఒంటరి మహిళలు అనేక ఆర్థిక ఇబ్బందులతో జీవిస్తున్నారని వారి సంక్షేమం కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చట్టం చేయాలని బహుజన లెఫ్ట్ మహిళా సంఘం రాష్ట్ర కన్వీనర్ సబ్బని లత డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని న్యూ అంబేద్కర్ భవన్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం, భారతదేశ మొదటి ఉపాధ్యాయురాలు సావిత్రమ్మ పూలే వర్ధంతి సందర్భంగా బహుజన శ్రామిక మహిళలు అనే అంశంపై జరిగిన జిల్లా సదస్సులో ఆమె మాట్లాడుతూ.. మార్చ్ 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవంగా మర్చ్ 10న మొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రమ్మ పూలే వర్ధంతిని బహుజన శ్రామిక దినోత్సవంగా భారత ప్రభుత్వం ప్రకటించాలని ఆమె కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను



డిమాండ్ చేశారు. భారతదేశంలో బహుజన శ్రామిక మహిళల హక్కులపై విరామేరుగని పోరాటాలు నిర్వహించిన చదువుల తల్లి సావిత్రమ్మ పూలే పోరాట వారసత్వాన్ని బహుజన శ్రామిక మహిళా ఉద్యమాలు తమ భుజస్కంధాలపై మోస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచినప్పుడే బహుజన శ్రామిక మహిళల హక్కులు, సంక్షేమం, సామాజిక న్యాయం సమగ్రాభివృద్ధి, స్వేచ్ఛా, సమానత్వం, సౌభ్రాతృత్వం సాధ్యమవుతుందని తెలిపారు. సభాధ్యక్షులుగా బహుజన లెఫ్ట్ మహిళా సంఘం జిల్లా నాయకురాలు తూర్పు విమల, ముఖ్య అతిథిగా ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ మాజీ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ ప్రతిమారాజ్, మహిళా టౌన్ ఎస్ఐ పుష్పా, గౌరవ అతిథిగా జి.ఆర్ సుజాత, తెలంగాణ ఫ్యామిలీ మహిళా కోఆర్డినేటర్ నిజామాబాద్ సదరన్ హోం సూపరింటెండెంట్ జ్యోత్స్న, ఎన్జీవో నాయకులు వర్ని రాజయ్య, బహుజన శ్రామిక మహిళా ఉద్యమ నాయకులు ప్రమీల, నిజామాబాద్ నగర కమిటి నాయకులు స్వాతి, పద్మిని, పాల్గొన్నారు.

కామ్రేడ్ రాయల సుభాష్ చంద్రబోస్
9వ వర్ధంతిసభను జయప్రదం చేయండి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

మార్చి 9న ఖమ్మంలో జరిగే కామ్రేడ్ రాయల సుభాష్ చంద్రబోస్ 9వ వర్ధంతిసభను జయప్రదం చేయండి అని సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ (ప్రజాపంథా) నగర కార్యదర్శి ఎం.సుధాకర్ అన్నారు. సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ పార్టీ నగర కమిటీ ఆధ్వర్యంలో రాయల సుభాష్ చంద్రబోస్ వర్ధంతిసభ పోస్టర్లను ఎస్ఆర్ భవన్, కోటగల్లిలో ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారత విప్లవోద్యమంలో అజ్ఞాత జీవితం గడిపి, అనేక ప్రజాఉద్యమాలను నిర్మించిన ఘనత కామ్రేడ్ రాయల సుభాష్ చంద్రబోస్ (రవన్న)కు ఉందన్నారు. గోదావరి లోయ పరివాహక ప్రాంతంలో లక్షలాది ఎకరాల పోడు భూములను గిరిజనులు, నిరుపేద గిరిజనేతరులకు సాధించడంలో రవన్న పాత్ర క్రియాశీలకమైందన్నారు. రష్యా తరహా పెట్టుబడిదారీ దేశంగా మన దేశముందని, భారతదేశంలో విప్లవం విజయవంతం కావాలంటే పార్టీ కార్యక్రమం, పంథా, నిబంధనావలిని మార్చుకోవాలని సిద్ధాంతీకరించిన నాయకుడనిన్నారు. భారతదేశంలో పెట్టుబడిదారీ వ్యవస్థకు వ్యతిరేకంగా వర్గ పోరాటాలను ఉధృతం చేయాలని ఆశించారని, తద్వారానే విప్లవం విజయవంతం అవుతుందని కామ్రేడ్ రవన్న సిద్ధాంతికరించారన్నారు. దేశంలో మనువాద, మతోన్మాద ఫాసిజం అత్యంత ప్రమాదంగా మారిన నేపథ్యంలో శ్రామిక, కష్టజీవుల సమైక్య, బలమైన ఉద్యమ నిర్మాణాలు అత్యంత ఆవశ్యకమన్నారు. కామ్రేడ్ రవన్న 9వ వర్ధంతి సభను పార్టీ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 9న ఖమ్మం జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్నామన్నారు. విప్లవాభిమానులు, పార్టీ శ్రేణులు, ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ డివిజన్ కార్యదర్శి ఎం.వెంకన్న, సహాయ కార్యదర్శి సాయన్న, పీవోడబ్ల్యూ జిల్లా కార్యదర్శి కె.సంధ్యారాణి, నాయకులు అమూల్య లలిత, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరించిన నాయకులు

భక్తి మార్గంలో నడవాలి

నవతెలంగాణ-మద్నూర్

ప్రజలు భక్తి మార్గంలో నడవాలని మాజీ ఎమ్మెల్యే అరుణాతార అన్నారు. మండల కేంద్రం పరిధిలోని సోమలింగాల గుట్ట ఆలయం వద్ద గత వారం రోజులుగా సప్త కార్యక్రమం కొనసాగుతుంది. గురువారం నాటితో సప్త భజన ముగింపు కార్యక్రమంలో జుక్కల్ మాజీ ఎమ్మెల్యే అరుణ తార పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యేను ఘనంగా సన్మానిచారు.



అరుణ తారను సన్మానిస్తున్న పలువురు

కూచిపూడి నృత్య పరీక్షలు

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని నటరాజు నిత్యానికేతన్ శాస్త్రీయ నృత్య శిక్షణ కేంద్రంలో డాక్టర్ బాశెట్టి మృణాళిని ఆధ్వర్యంలో కూచిపూడి గ్రేడ్1, నృత్య పరీక్షలు గురువారం నిర్వహించారు. నాట్యాచారిని పి.ఉదయశ్రీ పరీక్ష అధికారిగా వ్యవహరించారు. 20 మంది చిన్నారులు నృత్య పరీక్షకు హాజరైనారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపకులు శ్రీ మాడవేటి నారాయణ మాస్టర్, నాట్య గురువులు మాట్లాడుతూ.. కూచిపూడి నృత్యం కేవలం ప్రదర్శనకు పరిమితం కాకుండా, శాస్త్ర సంబంధ విషయాలను, సిద్ధాంత, శ్లోక ప్రయోగాలుగా విభజించి, దశలవారీగా నేర్పి విద్యా విధానాన్ని రూపొందించామన్నారు. గత నాలుగు సంవత్సరాలుగా పరీక్షలు నిర్వహించి, విద్యార్థులకు సర్టిఫికెట్ అందజేస్తున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా కళార్చనలు తమ సహాయ సహకారాలు అందిస్తున్నటువంటి తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు



మహిళల సమగ్ర అభివృద్ధే దేశాభివృద్ధికి మూలం

- వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్.టి. యాదగిరిరావు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఆధునిక సమాజంలో మహిళలు ప్రవేశించని రంగం లేదని ఇటీవలి కాలంలో ప్రభుత్వం అన్ని రంగాలలో మహిళలను అగ్ర భాగాన నిలిపేందుకు తీవ్రమైన చర్యలు చేపడుతుందని, మహిళల సమగ్ర అభివృద్ధే దేశాభివృద్ధి మూలమని వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ టి యాదగిరి రావు పేర్కొన్నారు.గురువారం తెలంగాణ యూనివర్సిటీలో ఉమెన్ సెల్ డైరెక్టర్ డాక్టర్ భ్రమరాంబిక అధ్యక్షతన అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ టి యాదగిరిరావు పాల్గొని మాట్లాడుతూ ఆధునిక సమాజంలో మహిళలు ప్రవేశించని రంగం లేదని, కేంద్ర ప్రభుత్వ ప్రవేశపెట్టిన నేషనల్ వుమెన్ డెవలప్మెంట్ ప్రోగ్రాంతో మహిళల ఆరోగ్యం, సంక్షేమం, సామాజిక భద్రత పెరిగిందన్నారు. మహిళల సమగ్రాభివృద్ధి తోనే వీక్షిత్ భారత్ లక్ష్యం నెరవేరుతుందన్నారు. భారతదేశంలో రాష్ట్రపతి పదవి మొదలుకొని ముఖ్యమంత్రుల వరకు మహిళలు రాజకీయాలలో దూసుకుపోతున్నారని పేర్కొన్నారు. శాస్త్ర సాంకేతిక రంగం తో పాటు పరిపాలన రంగంలో ప్రపంచం గుర్తించే విధంగా కొనసాగడం దేశానికే గర్వకారణమన్నారు. మహిళలకు ఇస్తున్న ప్రాధాన్యతతో అంతర్జాతీయంగా భారతదేశ తల ఎత్తుకొని నిలబడ్డదని గుర్తు చేశారు. అతిథిగా యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.యాదగిరి పాల్గొని మాట్లాడుతూ స్త్రీ, పురుషుల సంపూర్ణ సహకారంతోనే దేశం ముందుకు పోతుందని పేర్కొన్నారు. ప్రధాన వక్తగా పాల్గొన్న నిజామా బాద్ జిల్లా లీగల్ సెల్ సర్వీసెస్ అథారిటీ సీనియర్ జడ్జ్ పద్మావతి మాట్లాడుతూ సమాజంలో అన్ని రంగాలలో స్త్రీలు దూసుకుపోవాలన్నారు. అందుకు స్త్రీలకు అన్నిరకాల విద్యల పట్ల అవగాహన ఉండాలన్నారు. ఇటీవల అత్యధికమైన మహిళలు సైబర్ క్రైమ్ లో మోసపోతున్నారని జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అకుంఠిత దీక్షతో స్త్రీలు సాధించిన లక్ష్యాలు దేశాన్ని ఆర్థికంగా రాజకీయంగా సామాజికంగా ముందుకు తీసుకు వెళుతున్నాయన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ ప్రవీణ్ మామిడాల, ప్రొఫెసర్ విద్యావర్ధిని, ప్రొఫెసర్ అరుణ, ప్రొఫెసర్ లావణ్య, ప్రొఫెసర్ డాక్టర్ ఆరతి, ప్రొఫెసర్ అపర్ణ, డాక్టర్ శిరీష బోయపాటి, డాక్టర్ నందిని డాక్టర్ నీలిమ, డాక్టర్ శాంతాబాయి, డాక్టర్ కిరణ్ మయి,డాక్టర్ ప్రసన్న రాణి, డాక్టర్ స్రవంతి తదితరులు పాల్గొని సీనియర్ జడ్జ్ పద్మావతి ని ఘనంగా సన్మానించారు.



మాట్లాడుతున్న వీసీ యాదగిరి



పాల్గొన్న మహిళా ప్రొఫెసర్లు

నవోదయ స్కూలు ఏర్పాటు చేస్తాం

- బిజెపి నాయకులకు తొందరపాటు ఎక్కువ
- ఎంపీ అరవింద్ రాజీనామా చేయాలి

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

జక్రాన్ పల్లి మండలంలో నవోదయ స్కూల్ ఏర్పాటు చేస్తామని జిల్లా కాంగ్రెస్ నాయకులు. ఐడీసీఎంఎస్ మజీ చైర్మన్ మునిపల్లి సాయి రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలో పార్టీ నాయకులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మునిపల్లి సాయి రెడ్డి మాట్లాడుతూ నవోదయ పాఠశాలలతో బిజెపి నాయకులు రాజకీయం చేయవద్దని అన్నారు. నవోదయ స్కూల్ జక్రాన్‌పల్లిలో నిర్మించడం లేదని ఎమ్మెల్యే రాజీనామా చేయాలని బిజెపి నాయకులు అనడం సిగ్గు చేటని అన్నారు. నవోదయ స్కూల్ జక్రాన్‌పల్లి మండలంలో నిర్మించాలని కలెక్టర్‌తో చర్చించడంతో కలెక్టర్ మండలం లోని కలిగోట్, అర్గుల్, నారాయణపేట్ శివారు భూముల్లో విద్యార్థులకు అణువుగా ఉండే విధంగా భూములను పరిశీలించారని అన్నారు. సీఎంతో రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి మాట్లాడి మండలంలోని నిర్మించడం జరుగుతుందని అన్నారు. ఎంపీ అరవింద్ రైతులకు మాటిచ్చి ఎన్నో అబద్ధాలాడిన వ్యక్తి పదిసార్లు అయినా రాజీనామా చేసిన తక్కువేనని అన్నారు. సమావేశంలో కార్యక్రమంలో పార్టీ ప్రసిడెంట్ చిన్న రెడ్డి, మాజీ ఇంచార్జీ సర్పంచ్ కాట్ పల్లి నర్సారెడ్డి, ఆర్గుల్ సింగిల్ విండో చైర్మన్ గంగారెడ్డి, మాజీ ఎంపీటీసీ గంగారెడ్డి, రూరల్ యువజన కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు సొప్పరి వినోద్, వసంత్ రావ్, మాజీసర్పంచ్ కిషన్ నాయక్, డిష్ రాజు, నట్టా తీరపతి, అక్బర్, మున్నాఫ్, జీతేందర్ నాయక్ ,ముత్తేమ్ రెడ్డి, రవి, శంకర్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

వచ్చే విద్యా సంవత్సరానికైనా పాఠశాలను ప్రారంభించాలి

- డిసిసిబి చైర్మన్ కుంట రమేష్ రెడ్డి



మాట్లాడుతున్న కుంట రమేష్‌రెడ్డి

నవతెలంగాణ-(వేల్పూర్)ఆర్మూర్

తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం 7 నవోదయ పాఠశాలలను కేటాయించడం జరిగిందని, అందులో జిల్లాకు ఒకటని,బిజెపి నాయకులు, ఎంపీ అరవిందు తామే జిల్లాకు మంజూరు చేయించాను అని చెప్పుకోవడం విడ్డూరంగా ఉందని డిసిసిబి చైర్మన్ కుంట రమేష్ రెడ్డి ధ్వజమెత్తారు. మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో కేంద్ర ప్రభుత్వ అధికారులు పాఠశాల కొరకు నిబంధనల ప్రకారం 3,4 ఎకరాల భూమి కావాలని నవోదయ పాఠశాల అధికారులు 20 25 జనవరి చివరి వారంలో లేఖ రాయడం జరిగిందని దాని అనుగుణంగా జిల్లా కలెక్టర్, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి లు జిల్లాకు అనుగుణంగా నిజామాబాద్ క దగ్గరగా రైల్వే లైను లేదా నేషనల్ హైవేకు అనుకొని ఉన్న స్థలం బోధన్ లో పరిశీలించటం జరిగిందని అన్నారు. ఎమ్మెల్యే చేసిన ప్రతిపాదననే గురించి మాట్లాడడం విడ్డూరమని జిల్లా అధికారులు మూడు ,నాలుగు స్థలాలను ఎంపిక చేసి అతి త్వరలో నవోదయ అధికారులకు పంపించటం జరుగుతుందని అన్నారు. పాఠశాలలపై ఎం.పి .కి ఏమాత్రం శ్రద్ధ ఉన్న ఈ ప్రతిపాదనలు ఓకే చేయించి వచ్చే విద్యా సంవత్సరం కైనా పాఠశాలను ప్రారంభించాలని డిమాండ్ చేసినారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

అత్యవసర రక్తదాన శిబిరం

నవతెలంగాణ-కామారెడ్డి

జిల్లాలోని రెడ్‌క్రాస్ సొసైటీ, కామారెడ్డి బ్లడ్ డోనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం ప్రభుత్వ ఆసుపత్రిలో అత్యవసరంగా బ్లడ్ అవసరం ఉన్నందున రక్త దాన శిబిరం ఏర్పాటు చేసి 50 యూనిట్ల బ్లడ్ అందజేసినట్టు రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ ఎం.రాజన్న అన్నారు. ఈ కార్యక్రమంలో సహకరించిన దానికి రిప్లై డోనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడుని అధ్యక్షులు కిరణ్‌ని వారి సభ్యులను జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షులు చైర్మన్ రాజన్న, కార్యదర్శి రఘుకుమార్ వారిని అభినందించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి రఘుకుమార్, కామారెడ్డి బ్లేడ్ డోనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు కిరణ్, ఆర్గనైజర్లు శివ, పుట్ట చంద్రశేఖర్, విలాస్, శ్రీకాంత్, రాజు, రవి, మైరు పటేల్ కుమార్, సాయి, వైద్య అధికారి వారి సిబ్బంది పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న యువకుడు

రవన్న అమరత్వం స్ఫూర్తితో విప్లవ పార్టీలు ఐక్యం కావాలి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ



కామ్రేడ్ రాయల సుభాష్ చంద్రబోస్ అలియాస్ రవన్న అమరత్వం స్ఫూర్తితో విప్లవ పార్టీలు ఐక్యం కావాలి అని న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి కామ్రేడ్ ఆకుల పాపయ్య పిలుపు ఇచ్చారు. న్యూ డెమోక్రసీ కార్యాలయం కోటగల్లిలోని నీలం రామచంద్రయ్య భవన్‌లో ఈనెల 9న జరిగే అమరుడు కామ్రేడ్ రాయల సుభాష్ చంద్రబోస్ తొమ్మిదవ వర్ధంతి సభ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఆకుల పాపయ్య మాట్లాడుతూ ప్రతిఘటన పోరాటయోధుడు , సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ రాయల సుభాష్ చంద్రబోస్ (రవన్న) పీడిత ప్రజలకోసం, రైతు కూలీల కోసం, శ్రామికుల కోసం వారికి ఆర్థిక రాజకీయ స్వాతంత్రం కోసం అనేక పోరాటాలు నిర్వహించాడని కొనియాడారు. కొంతమంది నాయకులు, తమ మాట చెల్లింపు కోసం, తమ పెత్తనం కోసం పార్టీని చీల్చాలని ప్రయత్నం చేసినప్పుడు దానిని తిప్పి కొట్టారన్నారు. రవన్న ఉన్నంతకాలం పార్టీని చీల్చడానికి ఎవరూ సాహసం చేయలేకపోయారని, ఆయన మరణానంతరం కుంటి సాకులు చెప్పి కేంద్ర పార్టీగా ఉన్న న్యూ డెమోక్రసీ నుండి కొంతమంది అవకాశవాదులు బయటికి వెళ్లిపోయారన్నారు. కామ్రేడ్ రవన్న మొదటి నుంచి విప్లవశక్తులు ఐక్యంగా ఉండాలని అప్పుడే శ్రామికులకు, ప్రజలకు అండగా ఉండగలుగుతామని చెప్పేవారన్నారు. తన జీవితకాలమంతా విప్లవ పార్టీల ఐక్యత కోసం కృషి చేశారని తెలియజేశారు. పార్టీని చీల్చుకొని బయటికి వెళ్లిన వారు రవన్న మా నాయకుడని చెప్పుకోవడం సరికాదని అన్నారు. చీలికవాదులు ఇకనైనా ఆత్మ విమర్శ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సిపిఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి ఎన్. దాసు, న్యూ డెమోక్రసీ నిజామాబాద్ నగర కార్యదర్శి నీలం సాయిబాబా, అఖిలభారత రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వేల్పూర్ భూమయ్య, ప్రధాన కార్యదర్శి దేశెట్టి సాయిరెడ్డి, నాయకులు ఏం. శివకుమార్, జి. రమేష్, గంగాధర్ పాల్గొన్నారు.

అతిగా మద్యం తాగి వ్యక్తి మృతి

నవతెలంగాణ-నిజాంసాగర్

పెండ్లికి వెళ్లి పెండ్లికూతురును తీసుకురావడానికి పంపించలేదని అతిగా మద్యం తాగి మృతి చెందిన ఘటన మండలంలోని ముగ్దంపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై శివకుమార్ కథనం ప్రకారం.. ఎల్లారెడ్డి పట్టణానికి చెందిన రాములు (42) మండలంలోని ముగ్దాంపూర్ గ్రామానికి చుట్టాల ఇంటికి పెళ్ళికి వచ్చాడు. పెండ్లికూతుర్ని తీసుకురావడానికి రాములును తీసుకెళ్లకపోయేసరికి అక్కడ కాస్త పెళ్లి వారికి, రాములుకు గొడవ జరిగేసరికి మృతుడు అతిగా మద్యం తాగాడు. అతని భార్య అయినా తులసమ్మ అక్కడికి వచ్చి మృతుడిని ఎల్లారెడ్డి తీసుకువెళ్లగా ఆ సమయంలో మృతుడు స్పృహ కోల్పోయాడు. స్పృహ కోల్పోయిన రాములును ఆసుపత్రి తీసుకువెళ్లగా అప్పటికే చనిపోయాడని ఎస్సై తెలిపారు. ఆమె భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల విజయోత్సవ సంబరాలు

నవతెలంగాణ-విలేకరుల బృందం

కంఠేశ్వర్: కరీంనగర్, నిజామాబాద్ అదిలాబాద్, మెదక్ జిల్లాల ఉపాధ్యాయ నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి మల్క కొమురయ్య, పట్టభద్రుల నియోజకవర్గంలో ఎమ్మెల్సీ అభ్యర్థి చిన్ని అంజిరెడ్డి గెలుపొందిన నేపథ్యంలో నిజామాబాద్ జిల్లా బీజేపీ లీగల్ సెల్, న్యాయవాద పరిషత్ ఆధ్వర్యంలో జిల్లాకోర్టు చౌరస్తాలో టపాకాయలు కాల్చి, మిఠాయిలు పంచి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా పరిషత్ జిల్లా అధ్యక్షుడు మల్లెపూల జగన్మోహన్ గౌడ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఉపాధ్యయ నిరుద్యోగ యువత పట్ల నిర్లక్ష్య వైఖరికి నిరసన వ్యక్తం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉత్తర తెలంగాణ ప్రజలు తీర్పునిచ్చి భాజపా పై విశ్వాసం తెలియజేశారని అన్నారు. రాబోవు రోజుల్లో రాష్ట్రంలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో న్యాయవాదులు బిట్ల రవి, పిల్లి శ్రీకాంత్, విఘ్నేష్ పడిగేల వెంకటేశ్వర్, అంజలి, లక్ష్మన్ రాజు, యాదగిరి, కేశవరావు, నారాయణ దాసు, అనిల్, మహేష్, దిలీప్ అవుల నారాయణ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

నిజామాబాద్‌రూరల్: ఉమ్మడి నిజామాబాద్-కరీంనగర్-మెదక్-ఆదిలాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో చిన్నమైల్ అంజిరెడ్డి విజయం సాధించిన సందర్భంగా నిజామాబాద్ రూరల్ కార్పొరేషన్ మండల అధ్యక్షులు జంగిటి అనంద్ ఆధ్వర్యంలో విజయోత్సవ సంబరాలు ఘనంగా నిర్వహించారు. తమ అమూల్యమైన ఓటు వేసిన పట్టభద్రులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఊపుతో రాబోయే మున్సిపల్ కార్పొరేషన్, స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ భారతీయ జనతా పార్టీ ఘన విజయం సాధించడం తథ్యం అని అన్నారు. కార్యక్రమంలో బిజెవైయం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు యాదల నరేష్, సెన్సార్ బోర్డు మెంబర్ ఆదీష్ కోర్వ. ఎస్సి మోర్చ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సందీప్ కుమార్. మహేష్, మామిడాల సునీల్. ఓడ్డెన్న తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్ : ఉమ్మడి నిజామాబాద్, అదిలాబాద్, కరీంనగర్, మెదక్, జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీగా అంజిరెడ్డి విజయం సాధించడం పట్ల గురువారం నియోజకవర్గంలోని నందిపేట మండల కేంద్రంలో సంబరాలు నిర్వహించినారు. ఈ సందర్భంగా అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జ్ పాలెపు రాజు మాట్లాడుతూ.. లోక్ సభ, ఎంపీతో పాటు నిజామాబాద్ అర్బన్, ఆర్మూర్ శాసనసభ గత ఎన్నికలలో గెలుపొంది, తాజాగా పట్టభద్రుల, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ స్థానాలను కైవసం చేసుకున్నామని, ఇదే ఉత్సాహంతో ప్రజాధరణతో జడ్పీ, అత్యధిక ఎంపీపీ స్థానాలు, పంచాయతీల్లో గెలుస్తామన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



డిచ్‌పల్లిలో..

ఆర్మూర్‌లో..

బీజేపీ పట్టణశాఖ ఆధ్వర్యంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ అంజిరెడ్డి ఘనవిజయం సాధించినందుకు గురువారం ఆర్మూర్ పట్టణం అంబేద్కర్ చౌరస్తా వద్ద బాణాసంచా కాల్చి మిఠాయిలు పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా భీష్మ పితామహులు భూపతి రెడ్డి, మాజీ చైర్మన్ కంచెటి గంగాధర్, జిల్లా అధికార ప్రతినిధి జస్సు అనిల్, కిషన్ మేర్గా నాయకులు నూతల శ్రీనివాస్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు మందుల బాలు మాట్లాడుతూ...మెదక్- అదిలాబాద్-నిజామాబాద్-కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ అభ్యర్థి అంజి రెడ్డి ఘన విజయం సాధించారన్నారు.

కాంగ్రెస్ పార్టీని మేధావి వర్గం విశ్వసించే పరిస్థితి లేదని విమర్శించారు, ఇక బీఆర్ఎస్ పార్టీ క్యాండెట్ ని కూడా నిలబెట్టే పరిస్థితి లేదని విమర్శించారు. 47 నియోజకవర్గాల ప్రజలు భారతీయ జనతా పార్టీకి ఓటు వేశారన్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు ఆకుల శీను, భయవత్ సాయి, జిల్లా అధికార ప్రతినిధి కలిగోట గంగాధర్, మాజీ పట్టణ అధ్యక్షులు ద్యాగ ఉదయ్ మాజీ రూరల్ అధ్యక్షులు రోహిత్ రెడ్డి, జాకీర్దర్ శీను, పాన్ శీను,గుగులోత్ తిరుపతి నాయక్, ఖందేశ్ ప్రశాంత్, అల్జాపూర్ రాజేష్, ఎంజె రమేష్, కలిగోట ప్రశాంత్, ఉదయ్, కుంటాల గంగాధర్, చిన్న రెడ్డి, కుమార్, మని కార్యకర్తలు పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లి : తెలంగాణ రాష్ట్రంలో బిజెపి పార్టీ అధికారం చేపట్టడం ఖాయమని మండల బిజెపి ఉపాధ్యక్షుడు జై డి గంగారెడ్డి అన్నారు. ప్రస్తుత పట్టభద్రుల, టీచర్స్ ఎమ్మెల్సీలలో ఇద్దరు బిజెపి అభ్యర్థులు గెలుపొందడంతో మండల కేంద్రంలో బిజెపి నాయకులు విజయోత్సవ ర్యాలీ గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల బిజెపి ఉపాధ్యక్షుడు జైడి గంగారెడ్డి మాట్లాడుతూ.. ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నమ్మె పరిస్థితిలో లేరని, అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ కల్లబొల్లి మాటలు నమ్మి మోసపోయారని గ్రహించి బిజెపిని గెలిపిస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను సక్రమంగా అమలు చేయకపోవడంతో ప్రజలు బిజెపి వైపు మొగ్గు చూపుతున్నారని అన్నారు. కార్యక్రమంలో మండల బిజెపి పార్టీ అధ్యక్షులు కన్నెపల్లి ప్రసాద్, కుంట శ్రీనివాస్, కాల్వ ఆనంద్, వేంపల్లి శ్రీనివాస్ గౌడ్, తిరుపతి రెడ్డి, కార్తీక్, రాజు రెడ్డి ,వేణు తదితరులు పాల్గొన్నారు.

ధర్పల్లి : ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన బీజేపీ శ్రేణులు మండలకేంద్రంలో గురువారం సంబరాలు జరుపుకున్నారు.నిజామాబాద్, మెదక్, కరీంనగర్, అదిలాబాద్ పట్టభద్రుల మరియు ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాజపా అభ్యర్థులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా మల్కా కొమురయ్య, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా అంజిరెడ్డి గెలుపొందిన సందర్భంగా మండల భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో టపాసులు కాల్చి సంబరాలు నిర్వహించారు. అదేవిధంగా, ఎమ్మెల్సీ ఎన్నికల్లో పాల్గొని భాజాపాకు సహకారం అందించిన పట్టభద్రులకు, ఉపాధ్యాయులకు భాజపా పార్టీ శ్రేణులు ధన్యవాదాలు తెలిపారు. ఈ వేడుకల్లో భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షులు మహిపాల్ యాదవ్, కర్క గంగారెడ్డి పెద్ద బాల్రెడ్డి, కోమటిదాస్, చిలుక మహేష్, రాజశేఖర్, రాజేందర్, రాజు, శ్రీకాంత్ మరియు వివిధ గ్రామాల బిజెపి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

డిచ్‌పల్లి : ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం సాధించిన సందర్భంగా భారతీయ జనతా పార్టీ డిచ్ పల్లి, ఇందల్ వాయి మండల శాఖల ఆధ్వర్యంలో గురువారం విజయోత్సవ సంబరాలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షులు లోలం సత్యనారాయణ, నాయిడి రాజన్న, మాజీ సర్పంచ్ కుంట మోహన్ రెడ్డి, తన్నీర్ వాసు, తదితరులు పాల్గొన్నారు.

భిక్కనూర్ : కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ ఎమ్మెల్సీ ఎన్నికలలో బిజెపి అభ్యర్థి కొమురయ్య, పట్టభద్రుల ఎన్నికలలో అంజిరెడ్డి ఘన విజయం సాధించడం పట్ల పట్టణ కేంద్రంలో మండల బిజెపి నాయకులు బాణాసంచాలు కాల్చి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బిజెపి అభ్యర్థులకు ఓట్లు వేసి గెలిపించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలాధ్యక్షులు రమేష్, జిల్లా నాయకులు రమేష్, మండల బిజెపి నాయకులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

గాంధారి : మండల కేంద్రంలో బిజెపి కార్యకర్తల విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. మండల కేంద్రంలోని నెహ్రూ చౌరస్తా వద్ద టపాకాయలు పేల్చి సీట్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా బిజెపి మండల అధ్యక్షుడు మధుసూదన్ మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికలలో బిజెపి బలపరిచిన అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించినందుకు ఓటర్లకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు మధుసూదన్ రావు, జిల్లా సీనియర్ నాయకులు సాయిబాబా, మండల ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌గౌడ్, మండల ఉపాధ్యక్షులు మాణిక్యరావు, గంగి రమేష్, కిషన్, సంజీవులు, సుబ్బారావు, బాలర్జున్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్మూర్ : నందిపేట్‌లో..

నాగిరెడ్డిపేట్ : మండల కేంద్రంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించి పటాకులు కాల్చి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు హనుమాన్లు, పార్టీ సీనియర్ నాయకులు రాజమోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మద్నూర్ : ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిజెపి పార్టీ రెండు ఎమ్మెల్సీ సీట్లను గెలుచుకోవడం పట్ల మండల కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే అరుణతార ఆధ్వర్యంలో విజయోత్సవ సంబరాలను గాంధీ చౌక్ ఆవరణంలో పెద్ద ఎత్తున నిర్వహించారు. కార్యక్రమంలో తెప్ప తుకారం, కృష్ణ పటేల్, అజేయ్, సక్కర్ల బాల్ కిషన్, అంజయ్య, శివాజీ, యాదవ్ రావు, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

తాడ్వాయి : బీజేపీ మండలాధ్యక్షుడు వెలమ సంతోష్‌రెడ్డి ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని పాత బస్టాండ్ ప్రాంతంలో కామారెడ్డి ఎల్లారెడ్డి రహదారిపై టపాకాయలు పేల్చి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో వెంకట్రావు, తిరుపతిరెడ్డి నరసింహులు, గంగారెడ్డి, మూదం దత్తాత్రేయ, యాదగిరి, రాజిరెడ్డి, బూత్ అధ్యక్షులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

కామారెడ్డి : ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణ రెడ్డి ఆదేశాల మేరకు పట్టణంలోని కొత్త బస్టాండ్ వద్ద పట్టభద్రులు ఎమ్మెల్సీగా చిన్నమైల్ అంజిరెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా మల్క కొమురయ్య విజయం సాధించిన సందర్భంగా టపాకాయలు కాల్చి, మిఠాయి పంచుకొని, నాయకులు, కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధనకార్యదర్శి నరేందర్ రెడ్డి, స్టేట్ కౌన్సిల్ మెంబర్ విపుల్, అసెంబ్లీ కన్వీనర్ లక్ష్మారెడ్డి, పట్టణ అధ్యక్షుడు శ్రీకాంత్, నాయకులు శ్రీనివాస్, నరేందర్, శ్రీధర్ రెడ్డి, రవీందర్, విజయ్, రఘు, ప్రతాప్, తదితరులు పాల్గొన్నారు.

ఎడపల్లి : మండలంలోని పలు గ్రామాలలో బీజేపీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు. అనంతరం గ్రామ వీధులలో బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.



ధర్పల్లిలో..



గాంధారిలో..

రైలు ఢీకొని వ్యక్తి మృతి

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో రైలు పట్టాలు దాటుతుండగా గుర్తుతెలియని రైలు ఢీకొని వ్యక్తి మృతి చెందినట్లు రైల్వే పోలీస్ స్టేషన్ ఎస్ఐ సాయినాథ్ గురువారం తెలిపారు. రైల్వే ఎస్సై సాయి సాయి రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం నిజామాబాద్ స్టేషన్ మేనేజర్ అయిన హరి కృష్ణ ఇచ్చిన సమాచారం ప్రకారం.. జిల్లా కేంద్రం లోని ఎల్లమ్మగుట్ట ప్రాంతానికి చెందిన బొందెలు ప్రతాప్ సింగ్ (60) నిజామాబాద్ నుండి డిచ్పల్లి వెళ్లే మార్గంలో గల మధ్యలో పూలాంగ్ వాగు బ్రిడ్జి వద్ద గుర్తు తెలియని రైలు రాకను గమని ంచకుండా రైలు పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొంది. తలకు గాయమై అక్కడికక్కడే మృతి చెంది నట్లు రైల్వే ఎస్ఐ తెలిపారు.

IN THE COURT OF THE HONOURABLE SENIOR CIVIL JUDGE AT: NIZAMABAD.
S.O.P. No. 05 OF 2025

Between:-
Smt. Loka Mallavva.
..Petitioner
And
The Asst P.F Commissioner and Others
..Respondents

TO, (R5)
5. To Whom So Ever it may concern.

Whereas the above named petitioner filed the above S.O.P for grant of SUCCESSION CERTIFICATE to claim the death benefits of her deceased mother by namely Late L.Sayamma @ Loka Sayamma R/o. H. No.1-9/1, Ghanpur village, Dichpally mandal, Nizamabad District for Rupees 54,900/- towards the death benefits of her deceased mother.

Take notice that the above S.O.P is posted for appearance on **18-03-2025 at 10.30 am.** If any person having any objections, any claim in this regard may appear before this honorable court and put forth their objections with relevant documentary proof. Otherwise the matter will be decided on merits

// BY ORDERS OF THE COURT //
G. RAMESH
B. PAVAN PRASAD
KOTA NAGESH
CELL.99855 74766,
Counsels for the petitioner.